

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 23-06-2026 | సంపుటి - 29 | సంచిక -31 | రూ : 4 | పేజీలు: 8




## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను
# అభివృద్ధి చేయండి

- కార్గో, ఎంఆర్‌వో వసతులు కల్పించండి
- రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌ను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి
- గాంధీసరోవర్‌కు భూములు బదలాయించినందుకు కృతజ్ఞతలు తెలిపిన ముఖ్యమంత్రి

దిల్లీ : భారత వాయుసేన (ఐఏఎఫ్) ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. దిల్లీలోని రక్షణశాఖ కార్యాలయంలో సోమవారం రక్షణమంత్రితో సీఎం భేటీ అయ్యారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి తరువాయి 2లో



## యూఏఈకి
# బ్రహ్మోస్ క్షిపణులు..

- యూఏఈకి బ్రహ్మోస్ క్షిపణి అమ్మకంపై భారత్ చర్చలు
- ఆకాశ్‌తీర్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌పైనా చర్చలు
- రక్షణ సామర్థ్యం పెంచుకునేందుకు యూఏఈ ఆసక్తి
- చర్చలు ప్రాథమిక దశలో ఉన్నా వేగంగా పురోగతి
- భారత్ ఆయుధ ఎగుమతులకు పెరుగుతున్న డిమాండ్

ఢిల్లీ : భారత్ తన ప్రతిష్ఠాత్మక బ్రహ్మోస్ సూపర్‌సానిక్ క్రూయిజ్ క్షిపణి మరియు ఆకాశ్‌తీర్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు విక్రయించే దిశగా చర్చలు జరుపుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో తమ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు యూఏఈ ఆసక్తి కనబరుస్తున్న తరుణంలో ఈ చర్చలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. తరువాయి 2లో

# అంగన్‌వాడీల్లో కొలువుల జాతర



- నియామక ప్రక్రియ ప్రారంభం
- 33 జిల్లాల్లో 15,982 ఖాళీలు
- టీచర్లు 3,100, సహాయకులు 12,882
- జిల్లాల వారీగా నోటిఫికేషన్ల జారీకి మార్గదర్శకాలు

హైదరాబాద్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కొలువుల భర్తీకి రంగం సిద్ధమైంది. భారీ సంఖ్యలో 15,982 పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. ఆయా జిల్లాల్లోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీగా ఖాళీలు గుర్తించిన శిశు సంక్షేమశాఖ..భర్తీకి నోటిఫికేషన్లు జారీచేస్తోంది. ఇప్పటికే పెద్దపల్లి జిల్లాలో టీచర్ పోస్టులు, మహబూబ్‌నగర్‌లోని 4 ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో టీచర్లు, సహాయకులు కలిపి 177 పోస్టులకు ఆయా జిల్లా కలెక్టర్లు ఉద్యోగ ప్రకటనలు జారీ చేశారు. అన్ని జిల్లాల్లో ఇదే తరహాలో వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీకానున్నాయి. తరువాయి 2లో




## పేదల నిజమైన గుండె ధైర్యం
# బసవతారకం ఆసుపత్రి

- లాభాపేక్షలేని సంస్థల్లో ఆదర్శం
- అన్‌స్టాపబుల్‌గా ముందుకు తీసుకెళ్తున్న బాలకృష్ణ
- ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రజతోత్సవ ముగింపు కార్యక్రమంలో చంద్రబాబు
- హాజరైన వెంకయ్యనాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు

హైదరాబాద్ : పేదవర్గాలకు నిజమైన గుండె ధైర్యం బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి అని తెదేపా అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 25 ఏళ్లుగా తెలుగు ప్రజలకే కాకుండా ఇతర రాష్ట్రాల వారికీ సేవలు అందిస్తోందన్నారు. సోమవారం రాత్రి హైదరాబాద్ మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రజతోత్సవ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లాభాపేక్ష లేని సంస్థలు వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చినప్పుడే పేదలకు నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. 'దేశంలో ఏటా 15 లక్షల క్యాన్సర్ కేసులు నమోదవుతుండగా సుమారు 9 లక్షల మంది మరణిస్తున్నారు. మహిళల్లో వచ్చే బ్రెస్ట్ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు' అని పేర్కొన్నారు. ఈ ఆసుపత్రి వేల కుటుంబాలకు తరువాయి 2లో



# లఖ్‌నవూలో ఘోరం..
## 15 మంది సజీవ దహనం

2లో

- అగ్నికీలల్లో వాణిజ్య భవనం
- అందులో యానిమేషన్ కేంద్రం, పెట్ క్లినిక్
- ప్రాణభయంతో కిందికి దూకిన విద్యార్థులు
- దుర్ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని సంతాపం

# చర్చలు సానుకూలం

- ముగిసిన ఉన్నత స్థాయి సమావేశం
- తుది ఒప్పందం కోసం కార్యాచరణ ప్రణాళిక
- లెబనాన్‌లో ఘర్షణల నివారణకు సెల్ ఏర్పాటు
- సాంకేతిక అంశాలపై సంప్రదింపులు ప్రారంభం

అమెరికా : మధ్యప్రాచ్యంలో యుద్ధానికి ముగింపు పలికేం దుకు అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్‌లో ఆదివారం ప్రారంభమైన ఉన్నత స్థాయి చర్చలు సోమవారం ఉదయం ముగిశాయి. ఈ వారంలో సాంకేతిక స్థాయి చర్చలను కొనసాగించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. లెబనాన్‌లో జరుగుతున్న పోరును నివారించడానికి ఓ విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు కూడా అంగీకారం కుదిరింది. ఈ మేరకు మధ్యవర్తిత్వ దేశాలైన పాకిస్తాన్, ఖతార్ తరువాయి 2లో





## రైల్వేమంత్రితో
# సీఎం భేటీ

- అపాయింట్‌మెంట్ ఇప్పించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- ఐఆర్‌ఎఫ్‌సీ రుణం ఇప్పించాలని విజ్ఞప్తి

హైదరాబాద్‌బ్యూరో : రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే అడ్డు అని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఢిల్లీలో ఆయనతో కలిసి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. మెట్రోరైల్ ఫేజ్ 2కు సంబంధించి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ) రుణాన్ని తరువాయి 2లో

# అయ్యో రామా..!

2లో



- దొంగల చేతుల్లో 'అయోధ్య'
- రామాలయ నిధుల దుర్వినియోగంపై మాజీ కరసేవకుడి ఆందోళన
- ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ సహా పలువురిపై ఆరోపణలు
- మూడు ఫిర్యాదులు నమోదైనా.. ఎఫ్ఐఆర్ లేదు
- మోడీ-యోగి ప్రభుత్వాల మౌనం ప్రశ్నార్థకం

# పేదల నిజమైన గుండె ధైర్యం బసవతారకం ఆసుపత్రి

(మొదటిపేజీ తరువాయి)

*** పేదలకు ఇబ్బంది లేకుండా చూడాలనేదే ఎన్టీఆర్ లక్ష్యం**

ఎన్టీఆర్ ధర్మపత్ని బసవతారకం క్యాన్సర్‌తో మృతి చెందగా.. భవిష్యత్తులో ఏ పేదవాడు కూడా ఆర్థిక ఇబ్బందులతో వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ ఆసుపత్రికి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని చంద్రబాబు పేర్కొన్నారు. అప్పట్లో చెన్నై అడయార్ ఆసుపత్రి, ముంబయిలోని టాటా ఆసుపత్రి వంటివి మాత్రమే ఉండేవని.. చివరకు అమెరికాలో వైద్యం అందించినా ఆమె దక్కలేదన్నారు. పేదలకు ఇబ్బంది లేకుండా చూడాలనే లక్ష్యంతో ఆసుపత్రి కట్టాలనే ఆలోచనే ఎన్టీఆర్ దార్శనికత అని కొనియాడారు. తండ్రి మొక్కనాటితే కుమారుడు బాలకృష్ణ కల్పవృక్షంగా తయారు చేశారని.. ఆసుపత్రిని క్యాన్సర్ బాధితులకు దేవాలయంగా మార్చారని ప్రశంసించారు. ట్రస్ట్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బాలకృష్ణ అన్‌స్టాపబుల్‌గా ఆసుపత్రిని ముందుకు తీసుకెళ్తున్నారని అభినందించారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 1,600కిపైగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారని, మూడు లక్షల కంటే ఎక్కువ మందికి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేసి అవగాహన కల్పించినట్లు తెలిపారు.

**మొట్టమొదట గెలిచేది హిందూపురమే**

సినీ రంగంలో అగ్రనటుడిగా బిజీగా ఉంటూ ఆసుపత్రిని సమర్థంగా ముందుకు నడుపుతూ రోగుల గుండెల్లో బాలకృష్ణ నిలిచారని చంద్రబాబు కొనియాడారు. తెలుగుదేశం పార్టీ మొట్టమొదటగెలిచే నియోజకవర్గం హిందూపురమని అన్నారు. తల్లి బసవతారకం పేరు మీద కుమారుడు.. తండ్రి ఎన్టీఆర్ పేరుతో కుమార్తె సేవ చేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా నారా భువనేశ్వరి తలసీమియా బాధితులకు అండగా నిలుస్తున్నారని వెల్లడించారు. స్వర్ణోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

**పాల్గొన్న ప్రముఖులు..**

బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ ముగింపు కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర సహాయ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, అనుప్రియా పటేల్, తెలుగు రాష్ట్రాల మంత్రులు దామోదర్ రాజనర్సింహ, సత్యకుమార్ యాదవ్, ఆసుపత్రి ఛైర్మన్ బాలకృష్ణ, రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఎంపీ పురందేశ్వరి, బాలకృష్ణ సతీమణి వసుంధర, చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, కోడలు నారా బ్రాహ్మణి, ఎంపీ భరత్, ఆయన సతీమణి తేజస్విని, సినీ దర్శకులు కొరటాల శివ, అనిల్ రావిపూడి, బాబీ, బోయపాటి శ్రీను, ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగేశ్వరరెడ్డి, కంచెర్ల రవీంద్రనాథ్, కంచెర్ల రమేశ్, సెంథిల్ రాజప్ప, సుబ్రహ్మణ్యేశ్వరరావు, రాకేశ్‌కలపాల, నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్, హైదరాబాద్ సీపీ సజ్జనర్, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ సహా పలువురు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల్లో కొలువుల జాతర

హైదరాబాద్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కొలువుల భర్తీకి రంగం సిద్ధమైంది. భారీ సంఖ్యలో 15,982 పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. ఆయా జిల్లాల్లోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీగా ఖాళీలు గుర్తించిన శిశు సంక్షేమశాఖ..భర్తీకి నోటిఫికేషన్లు జారీచేస్తోంది. ఇప్పటికే పెద్దపల్లి జిల్లాలో టీచర్ పోస్టులు, మహబూబ్‌నగర్‌లోని 4 ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో టీచర్లు, సహాయకులు కలిపి 177 పోస్టులకు ఆయా జిల్లా కలెక్టర్లు ఉద్యోగ ప్రకటనలు జారీ చేశారు. అన్ని జిల్లాల్లో ఇదే తరహాలో వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీకానున్నాయి.

**కొత్తగా ఇంటర్వ్యూ విధానం..**

'సాక్ష్యం' అంగన్‌వాడీ నిబంధనల ప్రకారం.. అంగన్‌వాడీ టీచర్, సహాయకుల పోస్టుల భర్తీకి ఇంటర్మీడియట్ విద్యార్హతను రాష్ట్ర ప్రభుత్వం ఈసారి తప్పనిసరి చేసింది. అలాగే పోస్టుల భర్తీలో ఇంటర్వ్యూ విధానాన్ని తీసుకువచ్చింది. ఈ మేరకు అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఇటీవల అనుమతి ఇచ్చింది. తాజాగా ఎంపిక విధానంలో ఇంటర్వ్యూకు అనుమతిస్తూ జీవో నం.4, మార్కుల వెయిటేజీ ఖరారు చేస్తూ జీవో నం.6 జారీ చేసింది. ఆ ప్రకారం.. మల్టీజోన్1 పరిధిలోని మొత్తం 20,584 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,853 టీచర్లు, 7,737 సహాయకుల పోస్టులు కలిపి మొత్తం 9,590 ఖాళీలు ఉన్నాయి. మల్టీజోన్2 పరిధిలో 15,197 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1247 టీచర్లు, 5145 సహాయకులు కలిపి 6,392 ఖాళీలు ఉన్నాయి.

**సుదీర్ఘ అధ్యయనం అనంతరం**

- వాస్తవంగా పోస్టులు భర్తీ చేయాలని ఏడాదిన్నర క్రితమే సర్కారు నిర్ణయించింది. నియామక విధానం, ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న సర్వీసు నిబంధనలు, తదితర అంశాలపై అధ్యయనం చేసి.. నియామక విధానాన్ని ఇటీవల ఖరారుచేసింది.
- అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తు చేసే అభ్యర్థులు పట్టణాలు లేదా గ్రామాల్లోని సంబంధిత వార్డులో స్థానికులై ఉండాలి.
- గిరిజన, ఆదివాసీ తండాలు, గూడేలు, ఆవాసాల్లో పోస్టులకు సంబంధిత ఆవాస ఎస్టీ మహిళలు అర్హులు. ఎస్సీ వాడల్లోని పోస్టులకు స్థానిక ఎస్సీ మహిళలు అర్హులు.
- అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా ఎంపిక కమిటీ (డీఎస్సీ)..అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. ఇంటర్వ్యూకు 10 మార్కులు కేటాయించింది.
- టీచర్ల, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసేందుకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి. సహాయకుల పోస్టులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అందుబాటులో లేనిపక్షంలో..తదుపరి పదోతరగతి పాసైన వారిని పరిగణనలోకి తీసుకోవాలని ఎంపిక నిబంధనల్లో పేర్కొంది.
- ఎంపికలో మార్కులకు వెయిటేజీ ఉంటుంది. ఇంటర్‌లో వచ్చిన మార్కులకు 70 శాతం, వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం వెయిటేజీ ఉంటుంది. ఇంటర్వ్యూలకు పది మార్కులు ఉంటాయి.

## లఖ్‌నవూలో ఘోరం.. 15 మంది సజీవ దహనం

లఖ్‌నవూ: తరగతి గదిలో కూర్చొని యానిమేషన్ నేర్చుకుంటున్న యువకులు కొందరైతే.. గేమింగ్ కేంద్రంలో ఆడుకోవటానికి వచ్చిన వారు మరికొందరు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న పెంపుడు జంతువులను క్లినిక్‌కు తీసుకువచ్చినవారు ఇంకొందరు. అనూహ్యంగా అలముకున్న అగ్నికీలల్లో వీరిలో 15 మంది సజీవ దహనమయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలోని కిక్కిరిసిన వాణిజ్య భవనంలో సోమవారం మధ్యాహ్నం ఈ హృదయవిదారక దుర్ఘటన చోటు చేసుకుంది. అలీగంజ్ ప్రాంతంలోని ఈ భవనంలో యానిమేషన్ శిక్షణ కేంద్రం, పెట్ క్లినిక్, గేమింగ్ కేంద్రం వంటివి ఉన్నాయి. అగ్నికీలలు క్షణాల్లో చుట్టుముట్టడంతో భయభ్రాంతులైన పలువురు.. ప్రాణభయంతో కిందికి దూకారు. ఎక్కువమంది రెండో అంతస్తులో చిక్కుకున్నారు. అకస్మాత్తుగా మంటలు రావడంతో విద్యార్థులంతా భవనం వెనుకవైపు పరుగులు తీసినా వారి ప్రాణాలు దక్కలేదని ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ కన్నీళ్ల పర్యంతమయ్యారు. 14 మృతదేహాలను తన కళ్లారా అక్కడ చూశానని, అది హృదయాన్ని కలచివేసిందని ఘటనా స్థలంలో విలేకరులకు



వెల్లడించారు.

**అత్యవసర నిష్క్రమణ మార్గం లేదు!**

అత్యవసర నిష్క్రమణ మార్గం లేకపోవడంతో ఈ భవంతికి పక్కన ఉన్న మరో భవనం మీదుగా లోపలకు వెళ్లగలిగిన సహాయక బలగాలు కొందరిని రక్షించగలిగాయి. మృతదేహాలను అదే మార్గంలో కిందికి తీసుకువచ్చాయి. మంటలు వ్యాపించిన చోటుకు వెళ్లడానికి వీలుగా భవనానికి రెండుచోట్ల భారీ రంధ్రాలు చేయాల్సి వచ్చింది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాలు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. ఆసుపత్రికి చేర్చేటప్పటికే 15 మంది ప్రాణాలు కోల్పోయారని వైద్యులు ప్రకటించారు. కాలిన గాయాల కంటే పొగ పీల్చడమే వీరిలో ఎక్కువమంది మరణానికి కారణమని భావిస్తున్నారు. ప్రమాదంలో ఏడుగురికి గాయాలయ్యాయి. భవనం ఏసీ డక్ట్ నుంచే మంటలు మొదలైనట్లు ప్రాథమిక విచారణ చెబుతోందని యూపీ విద్యుత్తు శాఖ మంత్రి ఎ.కె. శర్మ తెలిపారు. భవన నిర్మాణంలో లోపాలపైనా విచారణ ఉంటుందని చెప్పారు.

**రూ.2 లక్షల పరిహారం ప్రకటించిన మోదీ**

ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, యూపీ నేతలు అఖిలేశ్, మాయావతి తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. ప్రమాదం తనకెంతో ఆవేదన కలిగించిందని, మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల వంతున పరిహారం అందిస్తామని మోదీ ప్రకటించారు. అలీగఢ్ పర్యటనలో ఉన్న ఆదిత్యనాథ్ ఈ ప్రమాదం గురించి తెలియగానే హుటాహుటిన లఖ్‌నవూ చేరుకుని ఘటనాస్థలిని పరిశీలించారు. నివేదిక సమర్పించాలని డీజీపీని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయండి

ఢిల్లీ : భారత వాయుసేన (ఐఏఎఫ్) ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని రక్షణశాఖ కార్యాలయంలో సోమవారం రక్షణమంత్రితో సీఎం భేటీ అయ్యారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి భూసేకరణ, యుటిలిటీస్ బదలాయింపు అంశాల్లో పూర్తిగా సహకరిస్తామని కేంద్రమంత్రికి చెప్పారు. వాయుసేన ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తున్నందున ఇది దేశ సమగ్రతకు, రక్షణకు సంబంధించిన అంశమని...రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందన్నారు. భారత వాయుసేన టెర్మినల్, ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న టెర్మినల్ భవనాలతో పాటు కార్గో, ఎంఆర్‌వో, హ్యాంగర్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇటీవల ఆసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ సంస్థలు హ్యాంగర్ల ఏర్పాటుకు సరైన ప్రదేశాలను అన్వేషిస్తున్నాయని, ఆదిలాబాద్ అందుకు అనుకూలమైనందున ఆ దిశగా అభివృద్ధి చేయాలని రక్షణమంత్రికి విన్నవించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు భూములు బదలాయించినందుకు కేంద్రమంత్రికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. డీఆర్‌డీవో/డీఆర్‌డీఎల్ ప్రాజెక్టు ఏర్పాటుకు దేవరకద్ర సమీపంలోని ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నందున.. ఆ ప్రాజెక్టును త్వరగా మంజూరు చేయాలని సీఎం కోరారు. సమావేశంలో రాష్ట్ర ఆర్‌అండ్‌బీ స్పెషల్ సెక్రటరీ వికాస్‌రాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ కేఎస్ శ్రీనివాసరాజు, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ (సమన్వయ) అద్వైత్‌కుమార్ సింగ్ పాల్గొన్నారు.

## రైల్వేమంత్రితో సీఎం భేటీ

హైదరాబాద్‌బ్యూరో : రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే అడ్డు అని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఢిల్లీలో ఆయనతో కలిసి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. మెట్రోరైల్ ఫేజ్ 2కు సంబంధించి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) రుణాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారని సచివాలయంలో మంత్రులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి ఫైర్ అయిన సీఎం సోమవారం అదే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి అదే ఐఆర్ఎఫ్‌సీ రుణాన్ని త్వరగా మంజూరు చేయాలని రైల్వేమంత్రిని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్ 2 అనుమతులపై చర్చించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులపై ఓ వినతిపత్రాన్ని సమర్పించారు. రైల్వేమంత్రితో అపాయింట్‌మెంట్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే ఇప్పించారని సమాచారం. ఇటీవలి కాలంలో సీఎం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. అభివృద్ధి పేరుతో బీజేపీపై సీఎం చేస్తున్న విమర్శలు, రాష్ట్రంలో ఆపార్టీకి రెండోస్థానం కల్పించడం కోసమేననే రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్న సమయంలో ఢిల్లీలో కిషన్‌రెడ్డి, సీఎం కలిసి రైల్వే మంత్రిని కలవడం చర్చనీయాంశంగా మారింది. దీనివల్ల ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.

*** థ్యాంక్స్...రక్షణ మంత్రికి సీఎం కృతజ్ఞతలు**

హైదరాబాద్‌లోని కంటోన్మెంట్ భూముల్ని రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయిస్తూ రక్షణ శాఖ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సోమవారం ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయం కర్తవ్య భవన్‌లో ఆయన్ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్) ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే దేవరకద్రలో డీఆర్ డీవో ప్రాజెక్ట్‌తో పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రెటరీ వికాస్‌రాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే.ఎస్.శ్రీనివాసరాజు, సీఎం సెక్రెటరీ మాణిక్ రాజ్, స్పెషల్ సెక్రెటరీ కో-ఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. తొలుత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ రివర్ డెవలప్మెంట్ లో భాగమైన 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు ప్రత్యేకంగా సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎంఆర్‌వో (ఎంఆర్వో), హ్యాంగర్ సౌకర్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల మధ్య ఆసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి సరైన ప్రదేశాలను అన్వేషిస్తున్నాయన్నాయని కేంద్ర మంత్రికి గుర్తు చేశారు.

## యూఏఈకి బ్రహ్మోస్ క్షిపణులు..

భారత్ తన ప్రతిష్ఠాత్మక బ్రహ్మోస్ సూపర్‌సానిక్ క్రూయిజ్ క్షిపణి మరియు ఆకాశ్‌తీర్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు విక్రయించే దిశగా చర్చలు జరుపుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో తమ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు యూఏఈ ఆసక్తి కనబరుస్తున్న తరుణంలో ఈ చర్చలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. రాయిటర్స్ మీడియా సంస్థ కథనం ప్రకారం, ఈ చర్చలు ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్నప్పటికీ వేగంగా ముందుకు సాగుతున్నాయి. భారత్‌రష్యాల సంయుక్త భాగస్వామ్యంలో అభివృద్ధి చేసిన బ్రహ్మోస్, ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన క్రూయిజ్ క్షిపణులలో ఒకటిగా గుర్తింపు పొందింది. శబ్దవేగం కంటే మూడు రెట్లు వేగంతో (మాక్ 3) ప్రయాణించగల ఈ క్షిపణిని భూమి, సముద్రం మరియు గగనతలం నుంచి ప్రయోగించవచ్చు. దీని పరిధి సుమారు 290 కిలోమీటర్లు. ఇక భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) అభివృద్ధి చేసిన 'ఆకాశ్‌తీర్', గగనతలం నుంచి ఎదురయ్యే ముప్పులను వేగంగా పసిగట్టి స్పందించే అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ కంట్రోల్ వ్యవస్థ. సాంప్రదాయకంగా అమెరికా వంటి పాశ్చాత్య దేశాల నుంచి ఆయుధాలను కొనుగోలు చేసే యూఏఈ, ఇప్పుడు తన రక్షణ అవసరాల కోసం ఇతర దేశాల వైపు కూడా దృష్టి సారిస్తోంది. యూఏఈ వద్ద ఇప్పటికే అమెరికా తయారీ థాడ్, పేట్రియాట్ వంటి శక్తివంతమైన రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. వీటికి అదనంగా ఆకాశ్‌తీర్ వ్యవస్థను జోడించడం ద్వారా తమ కమాండ్ అండ్ కంట్రోల్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచుకోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## చర్చలు సానుకూలం

మధ్యప్రాచ్యంలో యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్‌లో ఆదివారం ప్రారంభమైన ఉన్నత స్థాయి చర్చలు సోమవారం ఉదయం ముగిశాయి. ఈ వారంలో సాంకేతిక స్థాయి చర్చలను కొనసాగించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. లెబనాన్‌లో జరుగుతున్న పోరును నివారించడానికి ఓ విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు కూడా అంగీకారం కుదిరింది. ఈ మేరకు మధ్యవర్తిత్వ దేశాలైన పాకిస్తాన్, ఖతార్ విదేశాంగ శాఖలు ఓ ప్రకటనను విడుదల చేశాయి. అరవై రోజులలో తుది ఒప్పందం కుదుర్చుకోవడానికి వీలుగా ఓ కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరిగిందని ఆ ప్రకటన తెలియజేసింది. సంప్రదింపులు సానుకూలంగా, నిర్మాణాత్మకంగా జరిగాయని వివరించింది. చర్చలలో ఇరాన్, అమెరికా ప్రతినిధి బృందాలతో పాటు పాకిస్తాన్, ఖతార్ నేతలు కూడా పాల్గొన్నారు. చర్చల అనంతరం ఆయా దేశాల ప్రతినిధి బృందాలు స్విట్జర్లాండ్ నుంచి తిరుగుముఖం పట్టాయి. సాంకేతిక, నిపుణుల స్థాయి బృందాలు చర్చల ప్రక్రియను కొనసాగిస్తున్నాయి.

**కీలక పరిణామాలు ఇవే**

ఆదివారం జరిగిన చర్చలలో చోటుచేసుకున్న కీలక పరిణామం ఏమిటంటే రాజకీయ పర్యవేక్షణతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం. ఇరాన్ అణు కార్యక్రమం, అమెరికా ఆంక్షలు, వివాదాల పరిష్కారం వంటి అంశాలపై తదుపరి సాంకేతిక చర్చలను తక్షణమే ప్రారంభించడానికి ఈ కమిటీ పునాది వేస్తుంది. లెబనాన్‌లో ఘర్షణల నివారణ కోసం ఓ విభాగాన్ని ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం కూడా కీలకమైనదే. లెబనాన్‌లో ఘర్షణలను నివారించే విషయంలో ఈ సమావేశం మంచి పురోగతి సాధించిందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో తెలియజేశారు. ఇరాన్ చమురుపై విధించిన ఆంక్షలను అమెరికా ఎత్తివేసిందని, స్తంభింపజేసిన కొన్ని ఆస్తులను విడుదల చేసిందని చెప్పారు. ఇరాన్ పునర్నిర్మాణంఅభివృద్ధి ప్రణాళిక కూడా మొదలైందని అన్నారు.

## అయ్యో రామా!

న్యూఢిల్లీ : దేశంలో హిందూత్వ రాజకీయాలకు కేంద్రబిందువుగా ఉన్న యూపీలోని అయోధ్య రామమందిరం ఇప్పుడు అవినీతి, నిధుల దుర్వినియోగ ఆరోపణలతో వివాదాల్లో చిక్కుకుంది. బాబ్రీ మసీదు కూల్చివేత ఉద్యమంలో పాల్గొన్న మాజీ కరసేవకుడు సంతోశ్ దూబే స్వయంగా రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కోట్లాది మంది భక్తులు సమర్పించిన విరాళాల్లో రూ.200 కోట్లకు పైగా దుర్వినియోగం జరిగిందని ఆయన ఆరోపణలు చేస్తున్నారు. ఈ విషయంలో ఇప్పటికే మూడు ఫిర్యాదులు పోలీసులకు అందాయి. అయినప్పటికీ యూపీలోని యోగి ప్రభుత్వం ఇప్పటివరకు కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఈ పరిణామం హిందూత్వే ఎజెండాగా ముందుకెళ్లే బీజేపీకి ఇబ్బందికరంగా మారింది.

**రాముడి సంపదను దోచుకుంటున్నారు**

అయోధ్య రామమందిర నిర్మాణాన్ని దేశభక్తి, హిందూ ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రచారం చేసిన బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ వంటి హిందూత్వ శక్తులకు.. ఇప్పుడు అదే ఆలయానికి సంబంధించిన అంశం కొత్త తలనొప్పిని తీసుకొచ్చింది. రామజన్మభూమి ఉద్యమంలో కీలకంగా పనిచేసిన మాజీ కరసేవకుడు సంతోశ్ దూబే.. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, అనిల్ మిశ్రాతో పాటు ఇతరులపై నిధుల దుర్వినియోగ ఆరోపణలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రతిరోజూ ఆలయ హుండీల్లో నగదు, బంగారం, వెండి ఆభరణాల రూపంలో భారీగా విరాళాలు వస్తున్నాయనీ, వాటిలో గణనీయమైన భాగం అక్రమ మార్గంలో మాయమైందని ఆయన ఆరోపించారు. ఆలయాన్ని కాపాడాల్సిన వారే రాముడి సంపదను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

* జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు



రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి : ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే కోసం కాంగ్రెస్ సర్కార్ పనిచేస్తుందని.. స్టేషన్ ఘన్పూర్ అభివృద్ధి కడియం శ్రీహరితో సాధ్యమని జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు.సోమవారం రఘునాథపల్లి మండలం గబ్బెట గ్రామంలో కెనాల్ పనులను సందర్శించి పనులు వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్కు ఫోన్ చేశారు...వెంటనే స్పందించి కాంట్రాక్టర్ సూపర్వైజర్ ని పంపించారు.త్వరలోనే పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఆయన వివరించారు.సూపర్వైజర్ ధనుంజయ అక్కడికి వచ్చి రైతులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పతి ఎకరం నీటితో నిండుకుండ అలా ఉండాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందని రైతులకు సబ్సిడీలు... బోనస్ లు ఇచ్చేందుకు కృషి చేస్తుందని అన్నారు. స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గం 1400 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అందుకు కడియం శ్రీహరి కృషి ఆయన తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే కడియం శ్రీహరికి ప్రజలు అండగా ఉంటున్నారని ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేకల నరేందర్ వరలక్ష్మి, జిల్లా నాయకులు గాదె మహేందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ కూటికంటి ఉపేంద్ర అనిల్, యువసేన అధ్యక్షులు వడ్లకొండ శివప్రసాద్, వార్డ్ నెంబర్లు తాలపెల్లి అశోక్, మహేష్ గౌడ్, జెట్టపోయిన సమ్మయ్య, పెండల సత్యనారాయణ, అనిల్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్టీఈ 25% కోట అమలు చేయాలని ఫిర్యాదు




ప్రజాస్ఫూర్తి, భైంసా: భైంసా పట్టణం, మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) ప్రకారం పేద, బలహీన వర్గాల పిల్లలకు కేటాయించాల్సిన 25 శాతం ఉచిత ప్రవేశాల కోటా అమలు కావడం లేదని 'మన బడి పరిరక్షణ బృందం' ఆరోపించింది. ఈ మేరకు బృందం ప్రజా ఫిర్యాదు విభాగంలో సబ్ కలెక్టర్కు వినతి పత్రం అందజేసింది.విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలలో పేద పిల్లలకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాల్సి ఉందని, అయితే భైంసా ప్రాంతంలోని పలు పాఠశాలలు ఈ నిబంధనలను పాటించడం లేదని 'మన బడి పరిరక్షణ బృందం' చైర్మన్ సుంకేట మహేష్ బాబు తెలిపారు. అధికారులు ప్రభుత్వం నుంచి తిరిగి చెల్లింపులు రావడం లేదని చెబుతున్నప్పటికీ, చట్టం ప్రకారం ముందుగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి, అనంతరం ప్రభుత్వం నుంచి రావాల్సిన మొత్తాన్ని పొందే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ విషయంపై సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ స్పందించి, జిల్లా విద్యాశాఖ అధికారికి లేఖ రాసినట్లు బృందం తెలిపింది. 'మన బడి పరిరక్షణ బృందం' 202627 విద్యా సంవత్సరం నుంచి ఆర్టీఈ ప్రకారం 25 శాతం ఉచిత ప్రవేశాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది.తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బృందం సభ్యులు హెచ్చరించారు.

## నేడు పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు



జనగామ, ప్రజస్ఫూర్తి : తెలంగాణ లో విద్యారంగ సమస్యలు, ప్రైవేట్, కార్పొ రేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ, ప్ర భుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొ రత, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, విద్యా ర్థులకు యూనిఫాంల పంపిణీ వంటి అంశాల పై నిరసన వ్యక్తం చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 23 న (నేడు) రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల ల బం ద్ కు పిలుపునిచ్చింది. ఏబీవీపీ రాష్ట్ర నాయకులు ప్రభుత్వ విద్యా వ్య వస్థను బలోపేతం చేయాలని, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టేం దుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, విద్యాశాఖ లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభు త్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగు పరచడం, గురుకులాల్లో నాణ్య మైన సౌకర్యాలు కల్పించడం, విద్యా హక్కు చట్టం అమలు చేయడం వంటి డిమాం డ్లను కూడా ముందుకు తెచ్చా రు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్థల యాజ మాన్యాలు బంద్‌కు సహకరించాలని కోరారు.

## ధర్మోజీగూడెం పాల సంఘం చైర్మన్ గా రాచకొండ కృష్ణయ్య



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం ధర్మోజీగూడెం గ్రామం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఎన్నికలు సోమవారం నిర్వహించారు. పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం నూతన చైర్మన్ గా రాచకొండ కృష్ణయ్య ఎన్నికైనారు. డైరెక్టర్లుగా కొంతం ఎల్లారెడ్డి, జక్కలి మల్లయ్య, ఊదరి యాదయ్యలు ఎన్నికైనారు. నూతన చైర్మన్ రాచకొండ కృష్ణయ్య మాట్లాడుతూ తనను రెండోసారి చైర్మన్ గా ఎన్నుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పాల సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పాడి రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు.

# పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వండి

* మేడ్చల్ కలెక్టర్ కు విజ్ఞప్తి



ప్రజాస్ఫూర్తి, మేడ్చల్ జిల్లా : జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించి వారందరికీ అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా జర్నలిస్టుల ప్రతినిధుల బృందం మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా అర్బన్ జిల్లా కావడం వల్ల ప్రధాన పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలలో ప్రతి మండలంలో ఇద్దరు కంటే ఎక్కువ మంది విలేకరులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అక్రిడిటేషన్ జీవో 252 మేరకు మండలానికి ఒకే అక్రిడిటేషన్ ఇచ్చే అవకాశం ఉండడంవల్ల ఇతరులు నష్టపోయే ప్రమాదం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన పత్రికల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా సంస్థల నుంచి ఇచ్చిన సిఫార్సు లేఖలలో పేర్లు కలిగి ఉండి జీవో మేరకు అర్హులు కాని వారిని గుర్తించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా జిల్లా జర్నలిస్టులందరికీ న్యాయం చేసిన వారు అవుతారని కలెక్టర్ ను కోరారు.

**సానుకూలంగా స్పందించిన కలెక్టర్**

జిల్లాలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల అంశంలో అన్యాయం జరగకుండా చూస్తామని కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు. జర్నలిస్టుల బృందం చేసిన విజ్ఞప్తి మేరకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రవిచంద్ర, జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు రామారావు, రవీందర్, రామకృష్ణ, బాల్ రెడ్డి, సునీల్, శ్రీరాములు, రచ్చ శ్రీనివాస్, హనుమంత రెడ్డి, యూనియన్ జిల్లా నాయకులు భూపాల్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

* సోఫీనగర్ గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు
* స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు



ప్రజాస్ఫూర్తి, భైంసా: విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యతను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించేందుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి బి.వెంకటేశ్వర్లు సోమవారం సోఫీనగర్‌లోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్ గదులు, వంటశాల, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, వసతుల విషయంలో రాజీపడకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్ విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. అనంతరం వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ముచ్చటించారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ రుచికరమైన, పౌష్టికాహారం అందుతున్నదా లేదా అని విద్యార్థులను అడిగి నిర్ధారించుకున్నారు. చదువులో ఏవైనా సందేహాలు ఉన్నా, సమస్యలు ఎదురైనా వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సంక్షేమం, పాఠశాల అభివృద్ధి విషయంలో ఉపాధ్యాయులు, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో ప్రిన్సిపాల్ డానియల్, ఎం.ఈ.ఓ పద్మ, ఉపాధ్యాయులు కల్పన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో విషాదం.. లారీ ఢీకొని ఆర్టీవో మృతి

* బాధ్యతలు చేపట్టి 17 రోజులు.. ఘోర ప్రమాదంలో ఆర్టీవో దుర్మరణం





జయశంకర్ భూపాలపల్లి జిల్లా జూన్ 22 (ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి (ఆర్టీవో) వెంకన్నను వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం ప్రకారం.. జిల్లా రవాణా శాఖ కార్యాలయం ఎదుట వెంకన్న విధుల్లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ లారీ అదుపుతప్పి ఆయనపైకి దూసుకొచ్చింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కాగా, వెంకన్న ఇటీవలే భూపాలపల్లి జిల్లా ఆర్టీవోగా బాధ్యతలు స్వీకరించారు. కేవలం 17 రోజుల క్రితమే జిల్లాకు బదిలీపై వచ్చి విధుల్లో చేరిన ఆయన అకాల మరణం అధికార వర్గాలను, ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన మహమ్మద్ సంధాని జగిత్యాల జిల్లాకు బదిలీ కావడంతో వెంకన్న భూపాలపల్లికి వచ్చారు. ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. లారీ అదుపుతప్పిందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో విచారణ చేపట్టారు. వెంకన్న మృతితో జిల్లా రవాణా శాఖలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## బాసర ట్రిపుల్ ఐటీ.. యూనివర్సిటీలోని సమస్యలను పరిష్కరించాలి

* బాసర యునివర్సిటీ సమస్యలపై భైంసా సబ్ కలెక్టర్ కి వినతి



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లాలోని బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలైన అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ క్యాంపస్‌లో ఇటీవల పీ1 విద్యార్థిని భవనం పైనుంచి కిందపడిన ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, దీనిపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను త్వరగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. అలాగే, క్యాంపస్ మెస్‌లలో నిరంతరం పురుగులు,బొద్దింకలతో కూడిన నాణ్యత లేని కలుషిత ఆహారాన్ని వడ్డిస్తూ 9 వేల మంది విద్యార్థుల ప్రాణాలతో ఆడుకుంటున్న మెస్ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. క్యాంపస్‌లోని లోపాలను, మెస్ అవినీతిని విద్యార్థులు బయటపెడుతున్నారనే కక్షతో, వారినోళ్లు నొక్కే విధంగా యాజమాన్యం క్లాస్ రూమ్‌లు,మెస్‌లలో మొబైల్ ఫోన్ల వాడకంపై విధించిన నిరంకుశ ఆంక్షల సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించే ఇలాంటి తుగ్లక్ నిర్ణయాలను వామపక్ష విద్యార్థి సంఘాలు ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోవని స్పష్టం చేశారు.ఈ సమస్యలపై సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి, విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈకార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్,జిల్లా నాయకులు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు

## మండల ఉపసర్పంచ్ ల ఫోరం ఆధ్వర్యంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతి



చౌటుప్పల్,ప్రజాస్ఫూర్తి: ఉపసర్పంచుల హక్కుల సాధనకు సహకరించాలని కోరుతూ చౌటుప్పల్ మండలం ఉప సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు బొమ్మ కంటి కిషోర్ ఆధ్వర్యంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు మండల ఉపసర్పంచ్ ల ఫోరం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. తమ హక్కుల సాధనకు సహకరించాలని విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉప సర్పంచ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, మీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బాతరాజు ధనుంజయ, మండల ప్రధాన కార్యదర్శి బోయే సదానందం, మండల ఉప సర్పంచ్ లు ఫకీర్ శ్రీనివాస్ రెడ్డి, సురేందర్ రెడ్డి, గడ్డం సత్యం, చిన్నం బాలరాజు, ఉప్పునూతల నరసింహ, పెరుమాండ్ల లింగస్వామి, ప్రభాకర్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ఉక్కుపాదం

* జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: నర్సింగి మండలం నర్సంపల్లి గ్రామ శివారులో బొమ్మ-బొరుసు జూదం నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మెదక్ జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో కుమ్మరి లింగం, శ్రీరామ్ సతీష్, పెంజర్ల రాజేందర్, దేవసోత్ దశరథ్, చాకలి వెంకటేష్ ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.20,796 నగదుతో పాటు 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ కేసులో నవీన్ రెడ్డి, గుగులోత్ రాజ్ నాయక్ పరారీలో ఉన్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో జూదం, పేకాట, బొమ్మ-బొరుసు, కోడిపందేలు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా జూదం లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## యాంటీ డ్రగ్ అవేర్నెస్' పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:యాంటీ డ్రగ్ అవేర్నెస్' పోస్టర్లను జిల్లా ఎస్పి రోహిత్ రాజు సోమవారం కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పోస్టర్లు, బ్యానర్లు, యాంటీ డ్రగ్స్ సోల్జర్ సెల్ఫీ పాయింట్లు పంపిణీ చేయాలని అన్నారు. జూన్ 22 నుంచి 26 వరకు జిల్లాలోని పోలీస్ స్టేషన్ పరిధిలోగల పాఠశాలలు, కళాశాలలో, పట్టణాల్లో, గ్రామాలలో మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సమాజంలో మార్పు వచ్చినప్పుడే డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించగలమని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన కదలికలను గమనిస్తూ ఉండాలని కోరారు. గంజాయి అక్రమ రవాణా చేసినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఐదుగురు నిందితులు అరెస్టు



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను పరిగి పోలీసులు అరెస్టు చేసి నకిలీ పత్తి విత్తనాలు సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్ళితే.. కర్ణాటకలో జిన్నింగ్ చేయించి కిలో రూ. 500 చొప్పున నకిలీ విత్తనాలు తయారు చేసి, అమాయక రైతులకు రూ. 1500 నుండి రూ. 2000 వరకు అమ్ముతూ మోసానికి పాల్పడుతున్నారు. . వికారాబాద్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన పరిగి పోలీసులు, టాస్క్ ఫోర్స్ సంయుక్త బృందం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రంగంలోకి దిగిన పోలీసులు ఐదుగురు నింధితులను అరెస్టు చేసి రూ. 35 లక్షల విలువైన 20 క్వింటాళ్ల (53 బస్తాలు) నకిలీ విత్తనాలు, ఒక బైక్ ను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని, నకిలీ విత్తనాలు అమ్మినా, రవాణా చేసినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. రైతులు గుర్తింపు పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొని, రశీదులు తీసుకోవాలన్నారు.

# నోట్ పుస్తకాలు అందజేసిన అదనపు కలెక్టర్ వేణుగోపాల్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: పట్టణంలోని హనుమాన్ బస్తీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి విద్యాభ్యాసం, పాఠశాల పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్య జీవితంలో అత్యంత విలువైన సంపద అని, ప్రతి విద్యార్థి అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి విద్య కీలకమని పేర్కొంటూ, విద్యార్థుల భవిష్యత్‌కు దోహదపడే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరం యోగా:

# విశాల భారతి హై స్కూల్‌లో ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

*** పాఠశాల కరస్పాండెంట్ చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరం యోగా అని విశాలభారతి పాఠశాల కరస్పాండెంట్ చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం విశాల భారతి హై స్కూల్ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం మరియు క్రమశిక్షణ పెంపొందుతాయన్నారు. నేటి ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, యోగ గురువు బాలకృష్ణ, యోగ ఇన్‌స్ట్రక్టర్ ఝాన్సీ, పాఠశాల అధ్యాపకులు, బి.ఎడ్. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా వెన్నరాజు

*** పట్టణ అధ్యక్షుడిగా వడ్డేపల్లి వెంకటరమణ.**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వెన్న రాజు, హుస్నాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వడ్డేపల్లి వెంకటరమణలను టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ నియమించారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో లేని సమయంలో కూడా పార్టీ బలోపేతానికి వెన్న రాజు, వడ్డేపల్లి వెంకటరమణలు అంకితభావంతో పనిచేశారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వెన్న రాజు తన స్వగ్రామమైన మాలపల్లిలో తన సతీమణి వెన్న స్వర్ణలతను కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించుకున్నారు. రాబోయే రోజుల్లో పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తూ హుస్నాబాద్ లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎస్పీ సంకీర్త్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించి వారికి న్యాయం అందించడమే పోలీసు శాఖ లక్ష్యమని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులను స్వీకరించి వినతులు ఆలకించారు. ఈ సందర్భంగా మొత్తం 18 ఫిర్యాదులు అందగా, వాటిని పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత పోలీసు స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు. ప్రజలు ఎలాంటి మధ్యవర్తులు, పైరవీలు ఆశ్రయించకుండా నేరుగా పోలీసు శాఖను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. చట్టబద్ధంగా ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసు శాఖ బాధ్యత అని పేర్కొన్నారు.

# విధి నిర్వహణలోనే ప్రాణత్యాగం

*** డీటీఓ వెంకన్న మృతితో జిల్లాలో విషాద ఛాయలు**

*** సంతాపం తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ రాహుల్ శర్మ**





జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : విధి నిర్వహణలో అప్రమత్తంగా వాహనాల తనిఖీలు చేపడుతుండగా అతివేగంగా వచ్చిన బొగ్గు లారీ ఢీకొని జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) వెంకన్న మృతి చెందిన ఘటన జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఘణపురం మండలం చెల్పూర్ శివారులోని ఆర్టీఓ కార్యాలయం సమీపంలో సోమవారం ఉదయం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఘటనపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు ఫోన్ చేసి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. రహదారి భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం నెలరోజులుగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో వెంకన్న ఎంతో చురుకుగా పాల్గొన్నారని గుర్తుచేశారు. విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ, మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కూడా వెంకన్న మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో ఉంచిన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల జగిత్యాల జిల్లా నుంచి భూపాలపల్లి జిల్లాకు వచ్చిన వెంకన్న అంకితభావంతో పనిచేసే అధికారిగా పేరు పొందారని కొనియాడారు. అలాంటి నిబద్ధత కలిగిన అధికారిని కోల్పోవడం దురదృష్టకరమని అన్నారు.వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించిన కలెక్టర్ వారికి ధైర్యం చెప్పారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన వెంకన్న 2012లో రవాణాశాఖలో ఏఎంవీఐగా ఉద్యోగంలో చేరి క్రమంగా ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సంతాప సభలో వెంకన్న చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించి తమ సంతాపాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్ఓ వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అవగాహనతో ఎస్ఐఆర్ విధులు నిర్వర్తించాలి

*** కలెక్టర్ అంకిత్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026 ప్రక్రియపై పూర్తి అవగాహనతో విధులు నిర్వర్తించి, ఎన్నికల సంఘం నిర్దేశించిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో సర్‌లో భాగంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ అంకిత్ పాల్గొని మాట్లాడారు. పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటింటి సర్వేలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ సమగ్ర జీవనోపాధి కార్యక్రమం (టీఐఎల్‌పీ), తెలంగాణ సామాజిక అభ్యున్నతి కార్యక్రమం (టీఎస్‌డీపీ) అమలు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో తెలంగాణ సమగ్ర జీవనోపాధి కార్యక్రమం కింద గుండాల మండలంలో 800, దుమ్ముగూడెంలో 800, పినపాకలో 865, చర్లలో 865 కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. ఆయా కుటుంబాలకు జీవనోపాధి అవకాశాలు కల్పించడం, సంక్షేమ పథకాల అనుసంధానం, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అదే విధంగా బూర్గంపాడు మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని తెలంగాణ అల్పసంఖ్యాక గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఆహార నాణ్యత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ విద్యాచందన, ఏపీఎం వెంకయ్య, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రనాథ్, కొత్తగూడెం ఆర్డీవో మధు, బూర్గంపాడు తహశీల్దార్ కె.ఆర్.కె.వి ప్రసాద్, డీటీ సమ్మయ్య, ఎంపీడీవో జమ్మల రెడ్డి, ఎంపీవో, కళాశాల ప్రిన్సిపాల్ నాగజ్యోతి, వ్యవసాయ శాఖ అధికారి ఏవో శంకర్, హౌసింగ్ ఏడి, జి పి ఓ , ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎంటీలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు, ఏఎల్ఎంటీలు, మండల ఆపరేటర్లు, ఎన్నికల శాఖ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం మే లక్ష్యం

*** డీసీపీ రాజమహేందర్ నాయక్.**



జనగామ,ప్రజస్ఫూర్తి : యువతను మా దక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడుతూ మత్తు రహిత సమాజ నిర్మాణ మే తమ లక్ష్యమని డీసీపీ రాజమహేం ద్ర నాయక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం లోని ధర్మకంచ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణలో ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల, విద్యార్థుల సమక్షంలో నిర్వహించిన మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్య క్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, నేటి సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదా ర్థాల వ్యసనం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం దెబ్బతినడం తోపాటు కుటుంబాలు వి చ్ఛిన్నమై, సమాజం పై ప్రతికూల ప్రభా వం పడుతుందని హెచ్చరించారు. వి ద్యార్థులు చెడు అలవాట్లు,చెడు స్నేహా లకు దూరంగా ఉంటూ తమ లక్ష్య సా ధనలో భాగంగా చదువు పై పూర్తి దృష్టి సారించాలని సూచించారు. మాదకద్ర వ్యాల వ్యసనం నుంచి బయట పడటం అసాధ్య మేమీ కాదని,సరైన కౌన్సెలింగ్, కుటుంబ సభ్యుల సహకారం, పునరా వాస కేంద్రాల సేవలతో ఎవరైనా తిరిగి సాధారణ జీవితంలోకి రావచ్చని ఆయ న భరోసా ఇచ్చారు. మత్తు రహిత స మాజ నిర్మాణంలో విద్యార్థులు భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చిన డీసీపీ, మాదకద్రవ్యాలకు సంబంధించి న సమాచారం తెలిసిన వెంటనే పోలీ సులకు తెలియజేయాలని కోరారు. త మ తోటి విద్యార్థులు, కుటుంబ సభ్యు లకు మాదక ద్రవ్యాల దుష్పరిణామాల పై అవ గాహన కల్పించాలని సూచిం చారు. కార్యక్రమంలో సీ.ఐ సత్యనారా యణ రెడ్డి, పోలీసు సిబ్బంది, ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపా ళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

*** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజస్ఫూర్తి : ప్రజా సమస్యల ను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం తో తీసుకుంటోందని, ప్రజల వినతులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించడం ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నా రు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన "ప్రజావాణి" కా ర్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షా లోమ్ తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి వ చ్చిన ప్రజల ఫిర్యాదులను స్వయంగా స్వీకరించిన కలెక్టర్, సమస్యల స్వభా వాన్ని తెలుసుకుని వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజ లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా దరఖాస్తులను వేగం గా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీని పారదర్శకం గా పరిశీలించి, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమం లో మొత్తం 518 దరఖాస్తులు అందగా, వాటిని సం బంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించే చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రంగారావు, డీఆర్డీఓ భాస్కర్, గృహ నిర్మాణ శాఖ పీ.డీ మాత్రు నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వివిధ కార్యక్రమాల నిర్వహణపై టాస్క్ ఫోర్స్ సమావేశం




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ఈనెల 28వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు నిర్వహించనున్న పలు కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధ్యక్షతన ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఈనెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో బూత్ డే, 29, 30 తేదీలలో నిర్వహించే ఇంటింటి సర్వే, జూన్ 1 నుండి జూలై 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్, జూలై 13న జాతీయ పురుగుల నివారణ దినోత్సవం నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రజల్లో అవగాహన కల్పించడం, లబ్ధిదారులకు సేవలు అందించడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, జిల్లా చైల్డ్ హెల్త్ అండ్ ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రతాప్, సంబంధిత శాఖల అధికారులు, టాస్క్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# నాలుగు కుళ్లిపోయిన మృతదేహాల గుర్తింపు

*** ఒకే ఇంట్లో నలుగురు మృతి**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్ లో ఉన్న తెలంగాణ కాలనీలో ఒకే ఇంట్లో నలుగురి మృతదేహాలను కుళ్లిపోయిన స్థితిలో పోలీసులు గుర్తించారు. అయితే వీరు నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు మహమ్మద్ సుల్తాన్, ఆయన భార్య హసీనా సహా మరో ఇద్దరు మృతదేహాలు ఇంట్లో గుర్తింపుమృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో నాలుగు రోజుల క్రితమే మరణించి ఉండొచ్చని అనుమానం.ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం దించారు.హసీనా ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా, సుల్తాన్ ప్రకాశం బజార్‌లో బ్యాగుల వ్యాపారంలో పనిచేస్తున్నట్లు స్థానికుల సమాచారం.ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరణ.అదనపు ఎస్పీ జి. రమేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ ప్రారంభం.మృతికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

*** ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి**




పాలేరు, ప్రజా స్ఫూర్తి: యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం వ్యక్తి గత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రూరల్ ఏసీపీ మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు ఇతరులను కూడా అప్ర మత్తం చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు కట్టుబడి ఉన్నారని, మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పప రిణామాలపై విద్యార్థులు, ప్రజలకు కూడా విస్తృతంగా అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ సంజీవ్, ఎస్సై జగదీశ్ పాల్గొన్నారు.

## దేగాంలో ప్రీప్రైమరీ పాఠశాల ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా భైంసా మండలం లోని దేగాం గ్రామం లో ప్రీ ప్రైమరీ పాఠశాల ను సర్పంచ్ సిరం సుష్మరెడ్డి,ప్రారంభించారు. నేటి కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలో నర్సరీ, ఎల్.కె.జీ.యు.కె.జీ. తరగతులను ప్రభుత్వం ప్రారంభించడం శుభ పరిణామం అన్నారు. మండల విద్యాధికారి సుభాష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లో మరింత మెరుగైనా విద్యను అందించేందుకు ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమం లో ఉపసర్పంచ్ శివాజీ, సెక్రటరీవిజయ్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మేడిపల్లి నూతన సీఐ నీ సన్మానించిన మాజీ మేయర్ జక్కా



మేడిపల్లి , ప్రజాస్ఫూర్తి :మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ నూతన సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన డి.జలంధర్ రెడ్డి ని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో ఆయన విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ తమ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏదవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, నాయకులు జావీద్ ఖాన్, ఆకుల మధుకర్, శ్యామల శ్రీనివాస్, జిలాని పాషా, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల పరిరక్షణ చట్టం ఏర్పాటుతో సంబరాలు



ప్రజాస్ఫూర్తి,సూర్యాపేట:తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయవాదుల రక్షణ కోసం జూన్ 2న తీసుకొచ్చిన న్యాయవాదుల పరిరక్షణ చట్టం న్యాయవాదుల జీవితంలో ఒక మైలురాయి అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాది, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు అన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు నూకల సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులతో కలసి స్థానిక కోర్టు చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ కీలకమైందని అలాంటి న్యాయవ్యవస్థకు పిల్లర్లు న్యాయవాదులు అన్నారు. రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టే న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకొచ్చిందన్నారు. న్యాయవాదులకు ఎలాంటి సమస్యలు వున్నా రాంరెడ్డి దామోదర్ రెడ్డి పరిష్కరించే వారని, తన తండ్రిని ఆదరించినట్లుగా తనను ఆదరించి గౌరవించిన న్యాయవాదుల గౌరవాన్ని కాపాడుకుంటానన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో కోర్టు భవన నిర్మాణానికి ఇప్పటికే 10 ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో సంవత్సరంలో భవన నిర్మాణాన్ని పూర్తి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ప్రభుత్వ న్యాయవాదులు ఫరిదుద్దిన్, కోణం రఘు, దొరేపల్లి రమేష్, సీనియర్ న్యాయవాదులు బత్తిని వెంకటేశ్వర్లు, సినెపల్లి సోమేశ్వర్ రావు, ఉమాపతి, తల్లమళ్ళ హస్సేన్, బొమ్మగాని శ్రీనివాస్, వి.వి. రావు, టేకుపల్లి శ్రీనివాసరావు, మధుబాబు, డప్పు మల్లయ్య, పోలేబోయిన నర్సయ్య యాదవ్, బుచ్చేశ్వరరావు, పల్లా పరమేష్, ఉట్కూరి సైదులు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల పైన విద్యార్థులకు అవగాహన సదస్సు




ప్రజాస్ఫూర్తి ,జన్నారం : రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్, డిసిపి భాస్కర్, ఆదేశాల మేరకు జన్నారం ఎస్సై జి ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ జి శ్రీనివాస్ మరియు పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో జన్నారం మండలం ఇంధన పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో సోమవారం రోజున మత్తు పదార్థాలు గంజాయి, డ్రగ్స్ మొదలగు వాటి వల్ల జరిగే నష్టాలు గురించి వివరించారు. విద్యార్థులు గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు లేని సమాజాన్ని నిర్మించుటకు మత్తు పదార్థాలను వాడద్దు అని సే టు నో డ్రగ్స్ అనే కార్యక్రమాన్ని విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వినియోగించి జీవితాలను నాశనం చేసుకోవద్దు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేందర్, ఉపాధ్యాయులు తిరుపతి మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నియోజకవర్గం లో జరిగే అభివృద్ధి చూసి ఓర్వలేక

# మైనంపల్లి పై కేటీఆర్ బ్యాచ్ గ్లోబల్ ప్రచారం చేస్తుంది

*** మైనంపల్లి పై కేటీఆర్ బ్యాచ్ గ్లోబల్ ప్రచారం చేస్తుంది**



ప్రజాస్ఫూర్తి ,మెదక్ జిల్లా: మెదక్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంతరావు పై కేటీఆర్ బ్యాచ్ గ్లోబల్ ప్రచారం చేస్తుందని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆరోపించారు మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో నిర్వహించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తు మీలా కమిషన్లు తీసుకొని,బ్రోకర్ వ్యవహారం కాంగ్రెస్ పార్టీ నేతలకు రాదని అన్నారు.మెదక్ లో ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని ఆరోపించడం సరికాదన్నారు.జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఈ యాసంగిలో 4.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని, రికార్డు స్థాయిలో ధాన్యం రావడం వల్ల కొంత ఆలస్యం అయిందన్నారు. రైతుల సమస్య కోసం కాంగ్రెస్ పార్టీయే ముందుగా ధర్నా చేసిన విషయాన్ని గుర్తు చేశారు.ఇప్పటి వరకు మెదక్ లో వెయ్యి కోట్ల అభివృద్ధి జరిగిందని, కావాలంటే నిధుల వివరాలు బీఆర్ఎస్ నేతలకు పంపిస్తామని చెప్పారు. బిఆర్ఎస్ పాలనలో జరిగినట్టు ఇసుక అమ్మకోలేదని, మెదక్ లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు తరలిపోలేదన్నారు. అప్పుడు మీరు మీ షాడో ఎమ్మెల్యే ఏమి చేశారని ప్రశ్నించారు.ఎమ్మెల్యే టిక్కెట్ పరేషాన్ వల్ల ఏదేదో మాట్లాడుతుందని ఎద్దేవా చేశారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ వచ్చి రివ్యూ చేసిన విషయం బీఆర్ఎస్ నేతలు మరచిపోయినట్లు ఉన్నారని, అందుకే వరదలు వచ్చిన పట్టించుకోనట్లు మాట్లాడుతున్నారని అన్నారు.ప్రభుత్వం కార్యాలయాలు తరలిపోతుంటే చేతులు ముడుచుకు కూర్చున్న మీరు ఇప్పుడు అభివృద్ధి లేదని ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.మెదక్ నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, చర్చకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక, వైస్ చైర్మన్ నరేశ్ గౌడ్,మెదక్ పట్టణ అధ్యక్షులు గంగాధర్, మాజీ చైర్మన్ రాగి అశోక్, హఫీజ్, నాగరాజు, రమేష్, మహిపాల్ రెడ్డి, శ్రీకాంత్, బుద్ద రాజు,తాహెర్, విశ్వం, రాజశేఖర్, కౌన్సిలర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మొండికుంట అక్రమ నిర్మాణాలు తొలగించాలని అడిషనల్ కలెక్టర్ కు వినతి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గతంలో మొండికుంట కాలువపై నిర్మించిన కల్వర్టును.. యధాతధంగా నిర్మించాలని, మన్నుకుంట ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతూ చౌటుప్పల్ 18వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్, బిజెపి జిల్లా కార్యదర్శి ఆలె చిరంజీవి, బిజెపి మున్సిపల్ ఉపాధ్యక్షుడు వంగాల రమాకాంత్ లు యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డు లోని సర్వే నంబర్లు 174, 175, 176ల పరిధిలో ప్రవహిస్తున్న మొండికుంట కాలువ ఆక్రమణలపై తక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. 2020లో మొండికుంట కాలువ స్థలం ఆక్రమణకు గురైన విషయాన్ని అప్పటి మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించడమే కాకుండా, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని 35మీటర్ల పొడవుతో కల్వర్టు, 100అడుగుల వెడల్పుతో కాలువ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యం కారణంగా అదే ప్రాంతంలో మళ్లీ ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. అంతేకాకుండా,గతంలో ప్రతిపాదించిన పరిమాణాలకు విరుద్ధంగా కనీసం 20మీటర్ల పొడవు కూడా లేని కల్వర్టు నిర్మాణం చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చౌటుప్పల్ పట్టణంలోని 80శాతానికి పైగా మురుగునీరు, వర్షపు నీరు మొండికుంట కాలువ ద్వారానే ప్రవహిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా యథాస్థితి కొనసాగించే విధంగా తగిన పొడవు, వెడల్పుతో కల్వర్టు నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. అదేవిధంగా సర్వే నంబర్లు 174, 175, 176లలో పరిమితికి మించి జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, వెంటనే సర్వే నిర్వహించి సరిహద్దులు గుర్తించి, వెంటనే నాటించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## వరద నీటి కాలువల కోసం 12 కోట్ల నిధులు మంజూరు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీలో ఎన్నో ఏళ్లుగా వరద నీరు కాలనీల్లో నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని వారు తమ సమస్యలపై గత పాలకుల దగ్గర మొర పెట్టుకున్న వారికి సమస్యను తీర్చే నాధుడే కరువయ్యారని అంతే కాకుండా వారికి లాభాలు కూర్చే పనులను మాత్రమే చేశారని వారి వ్యక్తిగత లాభాలకోసం ప్రజలకు ఉపయోగ పడే ఏ ఒక్క పనులు కూడా చేయలేదు అని అన్నారు.పట్టణ ప్రజలను గత కొన్ని సంవత్సరాలుగా వెంటాడుతున్న వాన నీటి వరద కష్టాలకు చెక్ పెట్టేందుకు మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్ ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు.గత పాలకులు చేసిన తప్పులు, సరైన ప్రణాళిక లేని నిర్మాణాల కారణంగా స్వల్ప వర్షానికే పట్టణంలోని పలు వార్డులు, లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు నరకయాతన అనుభవించే పరిస్థితి నెలకొంది.పట్టణంలో వర్షపు నీరు సజావుగా బయటకు వెళ్లేలా శాస్త్రీయ పద్ధతిలో అత్యాధునిక 'స్టార్మ్ వాటర్ డ్రెయిన్' (వరద నీటి కాలువల) నిర్మాణ పనుల కోసం ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ఏకంగా 12 కోట్ల రూపాయల భారీ నిధులను మంజూరు చేయించరు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గూగులోత్ జ్యోతి రమేష్,స్థానిక వార్డు కౌన్సిలర్ చిదిరాల అరుణ జ్ఞానేశ్వర్,మున్సిపాలిటీ డిఈ ఉపేందర్,మహబూబాబాద్ మున్సిపాలిటీ లోని కాంగ్రెస్ పార్టీ కి చెందిన వివిధ వార్డుల కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి

*** గూగుల్ మీటి ద్వారా దరఖాస్తుల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్**




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : జిల్లా కలెక్టర్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పిడి పురుషోత్తం,డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నితీష్ ,జిల్లా అధికారులు, అన్ని విభాగాల సిబ్బందితో కలిసి కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం జిల్లా వ్యాప్తంగా ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేయాలని అన్నారు.భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పెన్షన్లు, పంచాయతీరాజ్,మున్సిపల్ సంబంధిత విభాగాలపై అధిక శాతం దరఖాస్తులు వస్తున్నాయని, జిల్లా కలెక్టరేట్ తో పాటు, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయలు తొర్రూరు డివిజన్, మహబూబాబాద్ డివిజన్ పరిధిలో కూడా ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని, ప్రజలకు వేగంగా, సత్వర సేవలను అందించాలనే ప్రధాన లక్ష్యంతో పారదర్శకంగా దరఖాస్తులను ఆన్లైన్ చేసి విభాగాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గార్ల మండలం, కోట్యా నాయక్ తండాకు చెందిన దారావత్ నరసింహ తన భూమికి సంబంధించి సర్వే ల్యాండ్ రికార్డు వారికి దరఖాస్తు చేసుకున్నానని ఇంతవరకు తన భూమిని సర్వే చేయలేదని తన భూమిని సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు.మహబూబాబాద్ మండలం,వి. ఎస్.లక్ష్మీపురం కు చెందిన ఆనంద్ తనకున్న వ్యవసాయ భూమి హోల్డ్ లో ఉందని అట్టి హోల్డ్ లో నుండి తీసివేసి తనకు న్యాయం చేయాలని కోరారు. మరిపెడ మండలం, లక్ష్మా తండ గ్రామానికి చెందిన లునావత్ సుక్కీ తాను గతంలో లక్ష్మా తండ లో అంగన్ వాడీ ఆయా గా పనిచేశానని,తాను ఇప్పుడు పదవ తరగతి పాసై ఉన్నానని అదే కేంద్రంలో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ టీచర్ గా తనకు ఉద్యోగం ఇప్పించాలని కోరారు.జిల్లా వ్యాప్తంగా ( 172 ) దరఖాస్తులు వచ్చాయని సంబంధిత విభాగాలకు పంపి చర్యలు తీసుకొనుటకు ఆదేశించడం జరిగిందన్నారు, ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయచంద్ర, పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, ట్రైబల్, ఎస్సీ,కార్పొరేషన్ అధికారులు దేశీ రామ్ నాయక్, శ్రీనివాసరావు, జిల్లా వైద్య అధికారి డాక్టర్ రవి రాథోడ్,అన్ని విభాగాల జిల్లా అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం

*** జిల్లా వ్యవసాయ అధికారి అంబిక సోనీ.**

జనగామ, ప్రజాస్ఫూర్తి : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటు లోకి తీసుకురావడంతో పాటు సన్న ధాన్యాల సాగును ప్రోత్సహించడమే లక్ష్యంగా జూన్ 23 నుంచి 30 వరకు జిల్లా లోని అన్ని రైతు వేదికల్లో విత్తన మేళా నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవ సాయ అధికారి అంబిక సోనీ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటన లో ఆమె మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యం లో నిర్వహించే ఈ విత్తన మేళా ద్వారా రైతులు తమ మండల పరిధిలోని రైతు వేదికల వద్దనే నాణ్యమైన విత్తనాలను పొందవచ్చన్నారు. అధిక దిగుబడులు సాధించేందుకు, మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న సన్న రకాల వరి సాగు ను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్ర ప్రభు త్వం బోనస్ ప్రకటించి ప్రోత్సహిస్తున్న బీపీటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటీ సోనా, కెఎన్ఎం 1638, కెఎన్ఎం 7715, డబ్ల్యుజీఎల్ 44, జై శ్రీరామ్ వంటి ఏడు సన్న రకాల వరి విత్తనాలను రైతులు ఎక్కువగా వినియోగించుకోవాలని సూచిం చారు.అదేవిధంగా పంటల పోషక నిర్వ హణలో భాగంగా నానో యూరియా, డీ ఏపీ వంటి ఆధునిక ఎరువుల వినియో గంపై రైతులకు అవగాహన కల్పించడం తో పాటు వాటి ప్రయోజనాలను వివ రించనున్నట్లు తెలిపారు. జిల్లా లోని అ న్ని మండల కేంద్రాల్లో ఉన్న రైతు వేదిక లలో మంగళవారం నుంచి విత్తన మేళా ప్రారంభం కానుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కుని నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ సాంకేతిక సూచనలు పొం దాలని జిల్లా వ్యవసాయ అధికారి కోరారు.

## అంబేద్కర్ విగ్రహానికి అంగన్వాడీ హెల్పర్స్ టీచర్స్ సిఐటియు ఆధ్వర్యంలో వినతి



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు ఎస్.కె యాకూబ్ మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రీ ప్రైమరీ పీఎంసీ విద్యను మొత్తం రాష్ట్రంలో ఉన్న 4131 కేంద్రాలను తక్షణమే రద్దు చేయాలని లేనియెడల ఈ కేంద్రాలను అంగన్వాడీలకు అప్పగిస్తూ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేయాలని ఐసిడిఎస్ ను బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో త్రిపురం సరిత పెండెంలక్ష్మి మాతంగి మేరమ్మ పెండెంమంగమ్మ ఇలేంద్ర ధనలక్ష్మి మామిడి ఎంకమ్మ కుమ్మరి కుంట్ల లక్ష్మి అనంతుసదాలక్ష్మి గాలి వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను రాజు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి

*** ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రైతుల సంక్షేమం కోసం పాటు పడుతూ, రైతును రాజు చేసే ప్రభుత్వం దేశంలోనే ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి స్పష్టం చేశారు. ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండు సంవత్సరాల కాలంలోనే 1 లక్ష కోట్లకు పైగా నిధులను రైతులకు అందించి ఆదుకున్న ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తాము అధికారంలోకి రాగానే రైతులకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో మాట ఇచ్చామని, ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షల రూపాయల వరకు రైతులకు రుణమాఫీ చేసి చూపించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదని కొనియాడారు. ఈ పత్రికా సమావేశంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జల రాజు, ఉపసర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు తాళ్ళ విజయ్ రెడ్డి, మేజర్ గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్ రంజాన్ నరేష్, గోపాలపల్లి ఉపసర్పంచ్ వేణు, సీనియర్ నాయకులు ఆరుట్ల మహేష్ రెడ్డి, ఉచ్చిడి బాల్ రెడ్డి, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు మిడిదొడ్డి భాను, మామిండ్ల ఆంజనేయులు, బండారి సాయి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల పరిరక్షణ చట్టం ఏర్పాటుతో సంబరాలు

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయవాదుల రక్షణ కోసం జూన్ 2న తీసుకొచ్చిన న్యాయవాదుల పరిరక్షణ చట్టం న్యాయవాదుల జీవితంలో ఒక మైలురాయి అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు అన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు నూకల సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులతో కలసి స్థానిక కోర్టు చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ కీలకమైందని అలాంటి న్యాయవ్యవస్థకు పిల్లర్లు న్యాయవాదులు అన్నారు. రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టే న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకొచ్చిందన్నారు. న్యాయవాదులకు ఎలాంటి సమస్యలు వున్నా రాంరెడ్డి దామోదర్ రెడ్డి పరిష్కరించే వారని, తన తండ్రిని ఆదరించినట్లుగా తనను ఆదరించి గౌరవించిన న్యాయవాదుల గౌరవాన్ని కాపాడుకుంటానన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో కోర్టు భవన నిర్మాణానికి ఇప్పటికే



10 ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో సంవత్సరంలో భవన నిర్మాణాన్ని పూర్తి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ప్రభుత్వ న్యాయవాదులు ఫరిదుద్దిన్, కోణం రఘు, దొరేపల్లి రమేష్, సీనియర్ న్యాయవాదులు బత్తిని వెంకటేశ్వర్లు, సినెపల్లి సోమేశ్వర్ రావు, ఉమాపతి, తల్లమళ్ళ హస్సేన్, బొమ్మగాని శ్రీనివాస్, వి.వి. రావు, టేకుపల్లి శ్రీనివాసరావు, మధుబాబు, దప్పు మల్లయ్య, పోలేబోయిన నర్సయ్య యాదవ్, బుచ్చేశ్వరరావు, పల్లా పరమేష్, ఉట్కూరి సైదులు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్య

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన బాలసాని బాలరాజ్ గౌడ్ (40) అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య గత 4 సంవత్సరాల క్రితం క్యాన్సర్‌కు గురి కాగా, ఆమె చికిత్స కోసం దాదాపు రూ.10 లక్షల వరకు అప్పులు అయ్యాయి. దీంతో అప్పులు ఎలా కట్టాలో మానసిక ఒత్తిడికి గురైన బాలరాజ్ ఈ నెల 21న సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఊరి చివరిలో గల రావి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని అల్లుడు గడ్డం సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ జ్యోతి తెలిపారు.

## ఆత్మకూరు (ఎస్) పీహెచ్‌సీలో అర్ధరాత్రి కాన్పు

* **మగబిడ్డకు జన్మనిచ్చిన బాలింత**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆదివారం అర్ధరాత్రి ఒక మహిళ సురక్షితంగా మగబిడ్డకు జన్మనిచ్చింది. సాధారణ కాన్పు (నార్మల్ డెలివరీ) కావడంతో అటు కుటుంబ సభ్యులు, ఇటు వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ, రాత్రి వేళలో గర్భిణికి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆత్మకూరు (ఎస్) పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. కేవలం 12 గంటల పాటు మాత్రమే సేవలందించే కేంద్రం అయినప్పటికీ, అత్యవసర పరిస్థితిని గమనించిన వైద్యాధికారి డాక్టర్ రమ్య మరియు ఆమె బృందం వెనుకాడలేదు. బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, అర్ధరాత్రి 11:27 గంటలకు మహిళకు విజయవంతంగా నార్మల్ డెలివరీ చేశారు. తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సెలవు రోజును సైతం లెక్కచేయకుండా, అర్ధరాత్రి వేళలో సమన్వయంతో పనిచేసి అంకితభావాన్ని చాటుకున్న డాక్టర్ రమ్య మరియు పీహెచ్‌సీ సిబ్బందిపై స్థానిక ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ప్రభుత్వ వైద్యంపై నమ్మకాన్ని పెంచేలా శ్రమించిన ఈ బృందం చూపిన ఈ నిబద్ధత, అంకితభావంపై ఆత్మకూరు ప్రజలందరికీ గర్వకారణంగా నిలిచింది.

## అర్హులైన పౌరులందరినీ సర్ లో భాగస్వామ్యం చేయాలి

* **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: జిల్లాలో అర్హులైన పౌరులందరూ ఈ ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం లో భాగస్వామ్యం చేయాలని, ఓటరు జాబితాలో తమ పేరును సరిచూసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించేందుకు అందరూ సహకరించాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ఈ నెల జూన్ 25 నుండి జూలై 24 వరకు జరుగుతుందని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్ కేంద్రానికి ఒక బూత్ ప్రతినిధిని నియమించి వివరాలు అందించాలన్నారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తారని, అర్హులైన ప్రతి ఒక్కరూ వారికి అవసరమైన వివరాలు అందించాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు చేర్చడం, తొలగించడం, సవరణలు చేయడం వంటి సేవలను https://voters.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా లేదా ఆన్‌లైన్‌లో కూడా చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కూడా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

* **జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను ప్రజల నుండి స్వీకరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 94 అర్జీలను స్వీకరించారు. అందులో రెవిన్యూ శాఖ 63, జిల్లా గ్రామీణభివృద్ధి 8, మున్సిపాలిటీ 6, సర్వే ల్యాండ్ 6, జిల్లా పరిషత్ 2, ఈఈ ఆర్ అండ్ బి 2, విద్యా 2, ఏ డి మైన్స్, సంక్షేమ శాఖ, సోషల్ వెల్ఫేర్, ఎక్సైజ్, ప్రణాళికా శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కల్పనా, జడ్పీ సీఈవో శోభారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గుడిసెలు లేని నియోజకవర్గంగా స్టేషన్ ఘనపూర్ ను తీర్చిదిద్దాలి

**: ఎమ్మెల్యే కడియం.**



జనగామ, ప్రజస్ఫూర్తి : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే కడియం శ్రీ హరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని గుడిసెలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడత నిర్మాణాల పురోగతి, రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మొదటి విడతలో మంజూరైన 3,500 ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రెండో విడతలో మంజూరైన 2,000 ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించి, నిజమైన అర్హులను గుర్తించాలని సూచించారు. గుడిసెలు, పెంకుటిళ్లు, రేకుల షెడ్లలో నివసిస్తున్నవారితో పాటు అద్దె ఇళ్లలో జీవిస్తున్న పేద కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, సంచార జాతుల నిరుపేద కుటుంబాలకు ప్రత్యేక అవకాశం కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ భూములు, వివాదాస్పద భూములను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అధికారులు చూపిన నిబద్ధతను ఇందిరమ్మ ఇళ్ల అమలులో కూడా కొనసాగించాలని కోరారు. పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం ఉండేలా చర్యలు తీసుకుని, జిల్లా ను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. ఈ సమావేశం లో స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, జిల్లా పరిషత్ సీ.ఈ.ఓ రంగా రావు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పంచాయతీ రాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువకులు, పిల్లలు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

* **అంగన్వాడి సూపర్వైజర్ పోటు వసంత లక్ష్మి**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : యువకులు, పిల్లలు మాదక దవ్యాలను సేవించటం వలన ఆరోగ్య సమస్యలతో పాటు, సామాజిక ఆర్థిక నష్టాలు సంభవించి కుటుంబ వ్యవస్థ కూడా చిన్నాభిన్నం అవుతోందని, కావున వాటికి మనందరం దూరం గా వుండాలని అంగన్వాడి సూపర్వైజర్ పోటు వసంత లక్ష్మి, గ్రామ పంచాయతీ సర్పంచ్ కడియాల పద్మ అప్పయ్య లు అన్నారు. గరిడేపల్లి మండలంలోని గానుగబండ గ్రామంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం ను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం లో ముందుగా నష ముక్తి భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమం లో వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలను సేవించేవారికి అనేక రకాలైన ఆరోగ్య సమస్యలు వస్తాయని ముఖ్యంగా గుండె జబ్బులు, మెదడు పని చేయక పోవడం, నాడీ వ్యవస్థ దెబ్బ తినడం, మరియు మానసిక రుగ్మతలు కూడా వస్తాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిచ్చయ్య, బాల సైదిరెడ్డి, అంగన్వాడీ టీచర్లు పోకల వెంకమ్మ జంగం అనిత అమరారపు సత్యవతి, మధుసూదన్, సజ్జన్, వెంకటేశ్వర్లు, జనార్ధన్, అమలారాణి, నాగయ్య, గోవిందయ్య, ఏడుకొండలు, మధు, గ్రామ పెద్దలు పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

## మారుతి సుజుకి విక్టోరిస్ ఎడ్జ్ ఎడిషన్' ఆవిష్కరణ




నల్గొండ, ప్రజాస్ఫూర్తి : నల్గొండలోని మారుతి సుజుకి అరేనా డీలర్ అయిన పవన్ మోటార్స్, సరికొత్త 'మారుతి సుజుకి విక్టోరిస్ యొక్క గ్రాండ్ లాంచ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. విక్టోరిస్ ఎడ్జ్ ఎడిషన్, ఆకర్షణీయమైన శైలి ఫీచర్లు మారుతి సుజుకికి ఉన్న విశ్వసనీయతను నల్గొండ వినియోగదారులకు అందిస్తోంది. తనదైన ప్రత్యేకమైన డిజైన్ మరియు అధునాతన సాంకేతికతతో, ఈ ఎడ్జ్ ఎడిషన్ స్ యు వి విభాగంలో ఒక బలమైన పోటీదారుగా నిలుస్తుంది. ఈ సందర్భంగా పవన్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి మాట్లాడుతూ, "సరికొత్త విక్టోరిస్ ఎడ్జ్ ఎడిషన్ను నల్గొండకు తీసుకురావడం మాకు చాలా సంతోషంగా ఉంది. విక్టోరిస్ ఫైవ్ స్టార్ భద్రతా రేటింగ్ ఉన్న కారు అత్యంత వేగంగా 1 లక్ష కార్ల అమ్మకాలను సాధించిన కారు, విక్టోరిస్ కార్ 2026 'ఇండియన్ కార్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికైంది. ఎడ్జ్ ఎడిషన్ ప్రత్యేకతలు నలుపు రంగు శైల ఉంటుంది నల్లని క్లాడింగ్ + సిల్వర్ స్కిడ్ హెడ్ల్యాంప్స్, డ్యూయల్ టోన్ ఎక్స్టీరియర్ ఏరో వెంట్స్ మరియు అంచులు షార్క్ ఫిన్ యాంటెన్నా, రూఫ్ రైల్స్, రియర్ స్పాయిలర్భా భారతీయ రోడ్లకు అనుగుణంగా మారుతి సుజుకి నిరంతరం ఆవిష్కరణలు చేస్తూనే ఉంది, ఈ సువ్ నిబద్ధతకు నిదర్శనం. ప్రత్యేక లాంచ్ ఆఫర్లు , టెస్ట్ డ్రైవింగ్ కోసం వినియోగదారులు అద్దంకి బైపాస్ రోడ్, చెర్లపల్లిలోని పవన్ మోటార్స్ను సందర్శించవలసిందిగా కోరుతున్నాము," అని అన్నారు. వినియోగదారులు ఇప్పుడు నల్గొండలోని చెర్లపల్లి, అద్దంకి బైపాస్ రోడ్లో ఉన్న పవన్ మోటార్స్ (మారుతి సుజుకి అరేనా) వద్ద విక్టోరిస్ ఎడ్జ్ ఎడిషన్ను బుక్ చేసుకోవచ్చు. ఈ కార్యక్రమానికి నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు జానకి గుమ్మల మోహన్ రెడ్డి, బొజ్జ శంకరయ్య, దొడ్డి రమేష్ పేరిక స్వాతి వినాయక్ రాజ్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు పవన్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి, సీనియర్ అధికారులు కందల రవి రెడ్డి, నాగమణి వినియోగదారులు ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బోడుప్పల్–చెంగిచెర్ల ప్రధాన రహదారి విస్తరణ పనులు వేగవంతం కానున్నాయి

- **మాజీ మేయర్ అజయ్ యాదవ్**

మేడిపల్లి : విస్తరణ పనులకు ప్రధాన అడ్డంకిగా మారిన విద్యుత్ స్తంభాల మార్పున కు నిధులు మంజూరు చేయబడినవి కావున పనులు మరింత వేగవంతం అవుతాయని బోడుప్పల్ మాజీ మేయర్ అజయ్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగాఅయన మాట్లాడుతూ ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం రోడ్డు విస్తరణ పనులు ఇక ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తామని తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి రహదారిని ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## జిల్లా వ్యవసాయ అధికారి వి. వినోద్ కుమార్

ప్రజాస్ఫూర్తి, నల్గొండ : ఈ నెల 23. నుండి 30. వరకు జిల్లాలోని 140 రైతు వేదికలలో విత్తన మేళా నిర్వహించబడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి వి. వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళా ముఖ్య ఉద్దేశ్యం అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న, వినియోగదారుడు ఇష్టపడే, తక్కువ కాల పరిమితి గలిగిన నాణ్యమైన సన్నని వరి రకాలను ప్రోత్సాహించడం, అదే విదంగా పప్పు దాన్యాల విత్తనాలు, నూనె గింజల విత్తనాలు రైతులకు గ్రామాలలోనే అందుబాటులో ఉంచడం, నానో యూరియా ను ప్రోత్సాహించడమన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అందరూ ప్రయివేట్ విత్తన వ్యాపారులు వారు వారు ఎన్నిక చేసుకున్న రైతు వేదికలలో ప్రభుత్వం ప్రోత్సాహిస్తున్న 7 రకాల వరి విత్తనాలు బి. పి. టి 5204, ఆర్ ఎన్ ఆర్ 15048, హెచ్ఎంటి సోనా, కే ఎన్ ఎం 1638, కేఎన్ఎం 7715, 44, జై శ్రీరామ్ రకాలను రైతు వేదికల దగ్గర అమ్మకానికి ఉంచుతారు. వీటిని రైతులు కొనుక్కోవచ్చును. ఈ 7 రకాల వరి విత్తనాలకు ప్రభుత్వం బోనస్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నది. అదే విదంగా ఎల్ నీనో పరిస్థితుల దృష్ట్యా ఇవి స్వల్ప కాలిక రకాలు కావున త్వరగా పంట చేతికి వస్తుందన్నారు. అదే విదంగా పంట మార్పిడి లో భాగంగా కంది, పెసర, మినుములు, నువ్వులు, కూరగాయల విత్తనాలు కూడా అందుబాటులో ఉంటాయని, అదే విదంగా యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియా వాడకాన్ని పెంచడానికి రైతులకు అవగాహన మరియు వాటిని అందుబాటులో ఉంచి రైతులు కొని వాడే విదంగా ఈ విత్తన మేళా ను ఒక ప్లాట్ ఫార్మ్ గా తయారు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన డిప్యూటీ సీఎం

**: బట్టి విక్రమార్క**



ప్రజాస్ఫూర్తి / ఖమ్మం జిల్లా : చింతకాని మండలంలో ఈ నెల 30 న సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో లచ్చగూడెం సమీపంలో జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా బహిరంగ సభకు వచ్చే ప్రజలకు, వాహనాల పార్కింగ్ కు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను పూర్తిచేయాని అధికారులను ఆదేశించారు. సీఎం సభకు ``రైతు ఆశీర్వద సభగా `` నామకరణం చేసినట్లు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కీలక ప్రకటనలు ఈ సభ వేదికగా జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, సీపీ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే పాల్గొన్నారు. తరువాత డిప్యూటీ సీఎం ఖమ్మంలో పలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## అంగన్వాడీలకు బి ఏల్ ఓ డ్యూటీ రద్దు చేయాలి

* **ఏఐటీయూసీ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి**

ప్రజా స్ఫూర్తి, నల్గొండ : అంగన్వాడీ టీచర్లకు బిఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలని అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డిప్రభుత్వాన్ని కోరటం జరిగింది. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపి కలెక్టర్ కు మెమొరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీలకు బి ల్ ఓ డ్యూటీలు వేయడం జరిగిందనీ కానీ చాలా అంగన్వాడి సెంటర్లకు హెల్పర్ లేకపోవడం వల్ల టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్ వచ్చిన తర్వాత అంగన్వాడి టీచర్లు ఎక్కువ రోజులు బి ల్ ఓ డ్యూటీలు నిర్వహించాల్సి ఉంటుంది దాని వలన అంగన్వాడి సెంటర్లు మూతపడే పరిస్థితి వస్తుంది అని ఆయన అన్నారు. కావున హెల్పర్ లేని అంగన్వాడి సెంటర్ల టీచర్ల బిఎల్ఓ డ్యూటీ రద్దు చేయాలని కోరారు.. ఇప్పుడే స్కూలు ప్రారంభమైతున్న దశలో టీచర్లు బిఎల్ఓ డ్యూటీకి వెళితే సెంటర్లు మూతపడి ఉంటే చాలా మంది పేద పిల్లలు గర్భిణీలు బాలింతలు పౌష్టికారానికి దూరమయ్యే ప్రమాదం ఉంది. మరియు సెంటర్ మూతపడి ఉంటే పిల్లల ఎన్రోల్మెంట్ తగ్గే ప్రమాదం ఉంది. ప్రభుత్వం నిబంధన ప్రకారం బిఎల్ఓ డ్యూటీ చేయకపోతే సస్పెండ్ చేస్తామని ఎమ్మార్వోలు బెదిరిస్తున్నారన్నారు .బిఎల్వో డ్యూటీ చేయలేక అంగన్వాడీ డ్యూటీ చేయలేక టీచర్లు మానసిక ఆందోళనతో అనారోగ్యం పాలవుతున్నారు. కావున హెల్పర్లు లేని అంగన్వాడి టీచర్లకు డ్యూటీ రద్దుచేసి పేద ప్రజలకు చిన్న పిల్లలకు పౌష్టికహారం అందే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాన్ని దేనిని అన్నారు. అంగన్వాడీలకు బిఎల్ఓ డ్యూటీ లో వేయకూడదని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఉన్నప్పటికీ ఎలక్షన్ కమిషన్ వారు పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు. అని రకాల పనులు అంగన్వాడిలతో చేయిస్తూ ప్రభుత్వం తక్కువ వేతనాలు ఇస్తున్నారని అన్నారు. గ్రామాల్లో గా డ్యూటీ ల వల్ల అంగన్వాడి టీచర్లు రాజకీయ వేదింపులకుగురవుతున్నారని కొన్ని ప్రాంతాల్లో అంగన్వాడీ టీచర్లపై దాడులు కూడా జరిగాయని అన్నారు. మార్వాడి టీచర్ల ఇబ్బందుల దృష్టిలో పెట్టుకుని తక్షణమే రియల్ గా డ్యూటీలో రద్దు చేయాలని ఆయన కలెక్టర్ కోరారు. హెల్పర్లేని అంగన్వాడి టీచర్లుకు ఇబ్బంది రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఆలోచించడని ఐ సి డి స్ పిడి కి కలెక్టర్ సూచన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) జిల్లా ఉపాధ్యక్షురాలు కోట్ల శోభ జిల్లా నాయకులు ఎన్ ప్రభావతి, జి అలివేలు, బి శోభా, వి వనజాత, షబానా సంతోష, కే అంజలి, ఏ మణెమ్మ ఎస్ కృష్ణవేణీ, కె పుష్పలత బి ప్రమీల, సీతారావమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## మైనంపల్లి పై బిఆర్ఎస్ నాయకుల విమర్శలను తీవ్రంగా ఖండించిన నేతలు



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, క్రిషాంక్‌లు కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావుపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మల్కాజిగిరిలో కాంగ్రెస్ నాయకులు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ నేతలు, తమ నాయకుడు మైనంపల్లి హనుమంతరావును విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదంటూ మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమ ఆస్తుల వ్యవహారాలు ప్రజలకు తెలుసని, అందుకే ప్రజలు ఆ పార్టీని అధికారానికి దూరం చేశారని విమర్శించారు. అనవసరంగా మైనంపల్లి హనుమంతరావుపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తే కాంగ్రెస్ శ్రేణులు తగిన విధంగా ప్రతిస్పందిస్తాయని హెచ్చరించారు. ప్రజల కోసం నిరంతరం కష్టపడుతూ ప్రజల్లోనే ఉంటూ సేవ చేస్తున్న మా నాయకుడు మైనంపల్లి హనుమంతరావు అని కొనియాడారు. సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నాయకులు తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. రాజకీయ విమర్శలు హద్దులు దాటకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## వర్షా కాలానికి ముందే కరీంగూడ పైప్‌లైన్‌కు రక్షణ కల్పించాలి

* **మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని భువనగిరి పట్టణానికి హైదరాబాద్ నుంచి హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ ద్వారా సరఫరా అవుతున్న 5.70 ఎంఎల్‌డీ కృష్ణా మంచినీటి పైప్‌లైన్‌కు తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అన్నారు సోమవారం, జిల్లా కలెక్టర్, అనురాగ్ జయంతి కి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు కు వినతిపత్రం అందజేసి అనంతరం ఆయన మాట్లాడుతూ కరీంగూడ వాగు వద్ద అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా పైప్‌లైన్ పూర్తిగా బయటపడిపోయి తేలాడుతున్న పరిస్థితి నెలకొందన తెలిపారు. భారీ వర్షాల సమయంలో వాగు ఉద్ధృతి పెరిగితే పైప్‌లైన్ దెబ్బతిని కొట్టుకుపోయే ప్రమాదం ఉందని, దీంతో భువనగిరి పట్టణంలో మంచినీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే నీటి ఒత్తిడి కారణంగా ఎయిర్ లీక్ ట్యాంక్ సామర్థ్యాన్ని మించి నీరు చేరి ఓవర్‌ఫ్లో అవుతూ ప్రతిరోజూ పెద్దఎత్తున తాగునీరు వృథా అవుతోందన్నారు. అదేవిధంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకేజీలను సకాలంలో మరమ్మతు చేయకపోవడంతో వేల లీటర్ల నీరు వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలానికి ముందే మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించి తీర్మానం చేయాలని, అవసరమైతే 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించి పైప్‌లైన్‌కు రక్షణ గోడలు, మరమ్మతులు చేపట్టాలని కోరారు. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ అధికారులు, మున్సిపల్ యంత్రాంగం సమన్వయంతో తక్షణ చర్యలు తీసుకుని పట్టణ ప్రజలకు ఎలాంటి మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## పెన్షనర్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ స్నేహ శబరీష్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 2024 మార్చి నుంచి నేటి వరకు రావాల్సిన బకాయిలను, ఐదు డిఏలను, పి ఆర్ సి, హెల్త్ కార్డ్స్ జారీ గురించి వినతి పత్రం సోమవారం ప్రజావాణిలో ఇవ్వనైనది ,నేటికి 96 మంది ఉద్యోగులు చనిపోవడం జరిగింది,గత నెల నుండి మా యొక్క పెన్షన్ డబ్బు నుండి ప్రీమియం కట్ చేయుచున్నారు.నేటికి హెల్త్ కార్డు ఇవ్వలేదు,ప్రధాన హాస్పటల్లో జాబితా కూడా ప్రకటించలేదు.అనారోగ్యంతో అనేకమంది హెల్త్ కార్డ్స్ లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు గురవుతున్నారు.వెంటనే హెల్త్ కార్డు ఇవ్వాలని జిల్లా శాఖ అధ్యక్షులు సంకా బద్రినారాయణ,గుగులోత్ కిషన్ నాయక్, గోవర్ధన్ డిమాండ్ చేశారు.మేము దాచుకున్న డబ్బును వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాము.నేటికీ 27 నెలలు పూర్తిగా వస్తున్నది. ఆయన ప్రభుత్వంలో కూడా చలనం లేదు.ప్రజాపాలనని చెబుతున్న ముఖ్యమంత్రి ఈ విధంగా ఇబ్బందులు గురి చేయటం ప్రాణాలతో చలగాడటం దారుణమని తెలిపారు.వెంటనే మాకు రావాల్సిన బ కాయలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాము.ఈ కార్యక్రమంలో,గుదే చంద్రమౌళి,మురళీధర స్వామి,కోల దర్గయ్య,పల్లా వెంకన్న,నిరంజన్ రెడ్డి, ఇమామ్, బాలాజీ, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

# రవాణా సౌకర్యంతో విద్యార్థుల డ్రాప్ అవుట్‌కు నివారణ

* **పాఠశాలల బలోపేతానికి రాజకీయాలకు అతీతంగా సహకరిస్తా**
* **గట్టుపల్ పీఎం శ్రీ పాఠశాల, సంస్థాన్ నారాయణపురం మోడల్ స్కూళ్లకు రూ.70 లక్షల విలువైన బస్సులు బహుకరణ**
* **ఇ.ఎల్.వి.భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్**







చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించడం ద్వారా చదువును మధ్యలో మానేసే పరిస్థితులు తగ్గుతాయని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ పేర్కొన్నారు. సంస్థాన్‌నారాయణపురం మండలకేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాల జూనియర్ కళాశాలకు, గట్టుప్పల్ మండలంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలకు ఫౌండేషన్ తరపున రూ.70లక్షల విలువైన 2స్కూల్ బస్సులను బహుకరించారు. సోమవారం ప్రిన్సిపాల్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బస్సులను ప్రారంభించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఇ.ఎల్.వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన ఫౌండేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రస్తుతం మోడల్ పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని ఆంగ్లంలో చేసిన ప్రసంగాన్ని అమెరికన్ యాసను తలపించేలా ఉందని ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులు మరెందరో ఎదగాలని, వారికి అవసరమైన సౌకర్యాల కల్పనకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. గట్టుప్పల్ పాఠశాల పరిధిలోని ఐదు గ్రామాల విద్యార్థులకు ఈ బస్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల మొదటి సంవత్సరం బస్సు డ్రైవర్ జీతలను కూడా తమ ఫౌండేషన్ భరిస్తుందని తెలిపారు.భవిష్యత్తులో పీఎం శ్రీ పాఠశాలను ఇంటర్మీడియట్ వరకు విస్తరించేందుకు అవసరమైన అనుమతులు తీసుకురావాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు. అవసరమైతే మరిన్ని బస్సులు, ఇతర మౌలిక సదుపాయాలు కూడా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాజకీయాలకు అతీతంగా సహకరిస్తానని, విద్యార్థుల భవిష్యత్తు కోసం తన ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు ఇ ఎల్ వి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్సై సంతోష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించిన జర్నలిస్టులు




పాలేరు, ప్రజా స్ఫూర్తి: 22 నెలల పాటు నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహించి, ఖమ్మం పట్టణానికి బదిలీపై వెళుతున్న ఎస్సై పి. సంతోష్‌ను సోమవారం స్థానిక జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ, ఎస్సై పి. సంతోష్ ప్రజల పట్ల స్నేహపూర్వక వైఖరితో పాటు విధి నిర్వహణలో అంకితభావాన్ని చేస్తున్నారని ప్రదర్శించారని కొనియాడారు. ఎన్ని ఒత్తిడులు, సవాళ్లు ఎదురైనా నిబద్ధతతో విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని ప్రశంసించారు. ముఖ్యంగా తలసేమియా బాధితులకోసం నిర్వహించిన బ్లడ్ క్యాంపులు బాధితులు జీవితాల్లో వెలుగులు నింపాయని కొనియాడారు. యువతను పట్టి పీడిస్తున్న గంజాయిని నిర్మూలన చేయుటకు అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఎస్సైకే దక్కిందని అన్నారు.నేలకొండపల్లి ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత హోదాల్లో పనిచేసి మరింత పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షించారు. ఎస్సై పి. సంతోష్ కూడా జర్నలిస్టులు అందించిన గౌరవానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా, ప్రజా వేదిక ఎడిటర్ గంజికుంట్ల వెంకన్న, ఈనాడు పత్రిక రిపోర్టర్ మైసా శ్రీను, పాలేరు వి6 రిపోర్టర్ దాన కర్ణ, అక్షిత రిపోర్టర్ ఖాసీం, ప్రజావాయిస్ జిల్లా స్టాఫర్ దుద్దేల సంజయ్, న్యూస్‌లైన్ తెలంగాణ జిల్లా ఇన్‌చార్జి అవుట మధు పాల్గొన్నారు.



## భువనగిరి కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

* **అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**

భువనగిరి, ప్రజాస్ఫూర్తి : భువనగిరి కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామనీ పనులను త్వరగా పూర్తి చేయాలని పర్యాటక సాంస్కృతిక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం భువనగిరి లో కోట క్రింద రోప్ వే, హోటల్ నిర్మాణం, పర్యాటకులకు మౌలిక సదుపాయాలు, కొండ పైన జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అధికారులు, అక్కడ అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు.వివిధ విభాగాల ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిపై మంత్రి ఆరా తీశారు.పనుల్లో తీవ్ర జాప్యం జరిగిందని అసహనం వ్యక్తంచేశారు.కొండ క్రింద(లోయర్ స్టేషన్ లో) రోప్ వే నిర్మాణం, హోటల్, పార్కింగ్, రెస్ట్ రూమ్స్,చిల్డ్రన్ ప్లే ఏరియా, రాక్ గార్డెన్ కు విద్యుత్ దీపాల అలంకరణ, కొండపైన (అప్పర్ స్టేషన్) కోట పునరుద్ధరణ, వాటర్ బాడీస్ బ్యూటిఫికేషన్, కేఫేటెరియా, కోట చరిత్రని తెలియజేయడానికి ఇంటర్ప్రిటేషన్ సెంటర్, మెట్ల పునరుద్ధరణ,ఎంట్రన్స్ ప్లాజా, టికెట్ కౌంటర్, వెయిటింగ్ లాంజ్, రెస్టారెంట్, పర్యాటకులకు మౌలిక సదుపాయాలపై సుదీర్ఘంగా చర్చించారు. భువనగిరి కోటను అత్యంత ఆధునీకరణ చేస్తున్నాం. కోట వైభవం ఉట్టిపడేలా దీనిని తీర్చిదిద్దుతున్నాం. అక్టోబర్ 2 నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. గత పాలకులు పర్యాటకాన్ని నిర్లక్ష్యం చేశారు. కనీస వసతులు కూడా కల్పించలేదు. నూతన పర్యాటక విధానాన్ని తీసుకువచ్చి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. తెలంగాణను దేశంలోనే అత్యంత ప్రాధాన్య పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడం,పర్యాటకం ద్వారా సంపద సృష్టి, ఉద్యోగ ఉపాధి కల్పన లక్ష్యంగా సమగ్ర కార్యాచరణతో ముందుకుసాగుతున్నాం.2047 నాటికి తెలంగాణను అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక, వారసత్వ సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం. యాదాద్రి, భువనగిరి కోట,కొలనుపాకలను అనుసంధానిస్తూ సమగ్ర ఆధ్యాత్మిక-వారసత్వ పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. తెలంగాణలోనే కాకుండా, భారతదేశం మొత్తంలోనే అత్యంత విశిష్టమైన బౌద్ధ వారసత్వ క్షేత్రాల పరిరక్షణ, పునరుద్ధరణకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దేశ ,విదేశీ పర్యాటకులకు అన్ని రకాల వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. స్వదేశ్ దర్శన్ స్కీమ్ 2.0 కింద వ్యయం రూ. 56.81 కోట్ల అంచనా వ్యయంతో భువనగిరి కోటను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నాం.వారసత్వ పరిరక్షణ, ఆధునిక సదుపాయాలు, పర్యాటక అనుభవాల మెరుగుదల, రోప్‌వే ఏర్పాటు ద్వారా పర్యాటకుల సంఖ్య పెరుగుతుందిరాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషికి తెలంగాణ ప్రజలు మద్దతు తెలపాలి.భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లడుతూ రోప్ వే పనుల పరిశీలన పర్యాటకులకు ఎంతగానో ఉపయోగపడే భువనగిరి ఖిల్లా రోప్ వే పనుల ప్రగతిని వారు ప్రత్యేకంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోట పరిసరాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ పర్యాటక రంగ అభివృద్ధి పనులను, మౌలిక వసతుల కల్పనను వారు నిశితంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీ చామల మాట్లాడుతూ భువనగిరి కోటను రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా పర్యాటకుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న రోప్ వే పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా అత్యంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను మరియు కాంట్రాక్టర్లను ఆదేశించారు. కొనసాగుతున్న అన్ని అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, పురావస్తు శాఖ డైరెక్టర్ డా. అర్జున రావు, ఆర్డీవో కృష్ణారెడ్డి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కన్న తల్లిని కోల్పోవడం అత్యంత విషాదకరం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా,డోర్నకల్ మండలం,గొల్లచర్ల గ్రామంలో కేజీకేఎస్ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు,సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,రాష్ట్ర అన్ని కుల సంఘాల కన్వీనర్ మేకపోతుల వెంకటరమణ (ఎంవీ రమణ) మాతృమూర్తి మేకపోతుల కమలమ్మ అంత్యక్రియలు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో విషాద వాతావరణంలో నిర్వహించారు.సుప్రజ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కమలమ్మ కన్నుమూసిన విషయం తెలిసిన వెంటనే మహబూబాబాద్ గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మయ్య గౌడ్ చిలువేరు వారి కుటుంబంతో ఉన్న అనుభందాన్ని గుర్తుచేసుకొని ఆవేధన వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.గొల్లచర్ల చేరుకొని రమణ తల్లీ కమలమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన సమ్మిగౌడ్ వారి పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని వేడుకున్నారు.ఈ సందర్భంగా మహబూబాబాద్ గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ జన్మనిచ్చి, పెంచి, జీవితానికి మార్గదర్శకురాలైన తల్లిని కోల్పోవడం ఏ బిడ్డకైనా భరించలేని వేదన అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం,సుప్రజ హాస్పిటల్ ఎండీ విజయ్ కుమార్ గౌడ్, కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు,రాష్ట్ర గౌడ సంఘాల అధ్యక్షులు ఐలి వెంకన్న, విజయకుమార్, గోపా రాష్ట్ర అధ్యక్షులు సాయన్న గౌడ్, గోపా జిల్లా అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్ గౌడ్, బెల్లంకొండ శ్రీనివాస్ గౌడ్, సమ్మెట వెంకన్న, గొర్రె వెంకన్న, కేజీకేఎస్ జిల్లా అధ్యక్షులు గౌని వెంకన్న,యమగాని వెంకన్న,బబ్బురు ఉప్పలయ్య,మోడెం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన

**: ఎస్సై శ్రవణ్ కుమార్**



లింగాల ఘణపురం / జనగామ, ప్రజా స్ఫూర్తి : జిల్లా లోని లింగాల ఘణపురం మండలం, నెల్లుట్ల జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాల లో సోమవారం పోలీసు శాఖ సహకారం తో తెలంగాణ ఈగల్ టీం సభ్యులు మాదక ద్రవ్యాల వినియో గం వల్ల కలిగే అనర్థాల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎస్సై శ్రవణ్ కుమార్ మాట్లాడు తూ, యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాల ని సూచించారు. మాదక ద్రవ్యాల విని యోగం వల్ల వ్యక్తిగత జీవితం తోపాటు కుటుంబం, సమాజం పై కూడా తీవ్ర ప్ర భావం చూపుతుందని తెలిపారు.విద్యా ర్థులు తమ భవిష్యత్తును దృష్టి లో ఉం చుకుని మత్తు పదార్థాలకు దూరంగా ఉండటమే కాకుండా, ఇతరులను కూడా అప్రమత్తం చేయాలని పిలుపు నిచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు కట్టుబడి ఉన్నారని, మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచా రం తెలిసిన వెంటనే ప్రజలు పోలీసుల కు తెలియజేసి సహకరించాలని కోరా రు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్, వీడీసీ చైర్మన్ బత్తిని అ శోక్, వార్డు సభ్యులు తాండ్ర భరత్,మా జీ ఉపసర్పంచ్ నర్సింగ ఎల్లస్వామి, కె. గంగాధర్, వై.భాస్కర్, ఉపాధ్యాయ బృందం. రెవిన్యూ ఇన్స్పెక్టర్ తదితరు లు పాల్గొన్నారు.




# 'అమ్మ' అధ్యక్ష పదవికి శ్వేతా మేనన్ రాజీనామా

మలయాళ చిత్రపరిశ్రమకు చెందిన నటీనటుల సంఘం 'అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్'(అమ్మ) వార్షిక సర్వసభ్య సమావేశంలో జరిగిన వాడివేడి చర్చల అనంతరం ఆ సంస్థ అధ్యక్షురాలు శ్వేత మేనన్, ఆమె నేతృత్వంలోని 17 మంది కార్యవర్గ సభ్యులు ఆదివారం రాజీనామా చేశారు. 2025లో 'అమ్మ' చరిత్రలోనే తొలిసారిగా నటి శ్వేతామేనన్ అధ్యక్షురాలిగా, కుకూ పరమేశ్వరన్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన మహిళలుగా ప్రత్యేకత చాటారు. గంటల వ్యవధిపాటు సాగిన సమావేశంలో అంతర్గత విభేదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన విషయంలో సభ్యుల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. ప్రధాన కార్యదర్శి కుకూ పరమేశ్వరన్ సమర్పించిన వార్షిక నివేదికలోని ఆదాయ-వ్యయ నివేదికలో స్పష్టత లేదని ఓ వర్గం సభ్యులు ఆరోపించడంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సమస్య మరింత ముదరడంతో అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవడంతో పాటు 'అమ్మ' సభ్యత్వానికి కూడా తాను రాజీనామా చేసినట్లు ప్రకటించారు శ్వేతా మేనన్. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. "సెప్టెంబరు 1 నుంచి మా ఆర్థిక వివరాలన్నీ సక్రమంగానే ఉన్నాయి. కానీ అంతకుముందు కమిటీకి సంబంధించి అనేక సమస్యలు ఉన్నాయి. సంఘంతో సంబంధాలు తెంచుకోవడం ఉపశమనంగా ఉంది. గతంలో ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తుల చేతికే సంఘాన్ని మళ్లీ అప్పగించే ప్రయత్నం జరుగుతోంది. మాకు సమాచారం ఇవ్వకుండానే మమ్మల్ని తొలగించే ఎజెండా నడిచింది. నాకు వ్యక్తిత్వం ఉంది. మనసులో మాట నిర్భయంగా చెప్తా. మేము ఎవరి చేతిలోనైనా కీలుబొమ్మలుగా ఉండి ఉంటే ఈ సంస్థను నడపలేకపోయేవాళ్లం. కానీ, ఇప్పుడు నేను కీలు బొమ్మగా మారడానికి సిద్ధంగా లేను" అన్నారు.



ప్రముఖ నటి రీతూ వర్మ లేటెస్ట్ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ అందమైన ఫొటోలో ఆమె సంప్రదాయ చీరకట్టులో ఎంతో హుందాగా, ఆకర్షణీయంగా కనిపిస్తూ అభిమానులను అలరిస్తోంది.

# నా బిడ్డే.. నా ప్రపంచం అవుతుంది



నటి సమంత ప్రస్తుతం హ్యాపీ మోడ్‌లో ఉన్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె నటించిన 'మా ఇంటి బంగారం' విజయం సాధించింది. మరోవైపు ఆమె తల్లి కానుందనే వార్తలు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తనకు పుట్టే పిల్లల గురించి సమంత గతంలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. కొన్నేళ్ల క్రితం ఓ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ.. ''నా బిడ్డే నా ప్రపంచం అవుతుంది. ఉద్యోగం చేసుకుంటూ పిల్లలను, ఇంటి బాధ్యతలను చూసుకునే మహిళలంటే నాకెంతో గౌరవం'' అని అన్నారు. అదే ఇంటర్వ్యూలో తన బాల్యం గురించి కూడా పంచుకున్నారు. ''నా చిన్నప్పుడు ఎన్నో కష్టాలు పడ్డాను. అలాంటి బాల్యం గడిపిన వారంతా వారి పిల్లలకు విలాసవంతమైన, సౌకర్యవంతమైన జీవితాన్ని ఇవ్వాలనుకుంటారు. నేను కూడా అదే నిర్ణయించుకున్నా. నా బిడ్డ పుట్టిన తర్వాత కొన్ని సంవత్సరాల పాటు తనను వదిలి ఎక్కడికీ వెళ్లను. తనే నా సర్వస్వంగా చూసుకుంటా'' అని చెప్పారు. తాజాగా జరిగిన 'మా ఇంటి బంగారం' సక్సెస్ సెలబ్రేషన్స్‌లో సమంత బేబి బంప్‌తో కనిపించారు. ఈ విషయంపై ఆమె సన్నిహిత వర్గాలను అడగ్గా.. సమంత, రాజ్‌లకు ఇది చాలా ప్రత్యేకమైన సమయం అని.. వాళ్లిద్దరూ కొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్నారని వెల్లడించాయి. దీంతో త్వరలోనే సామ్ ఈ గుడ్ న్యూస్‌ను అధికారికంగా వెల్లడిస్తారని ఫ్యాన్స్ భావిస్తున్నారు.


* **మిలియన్ డాలర్ల క్లబ్‌లోకి 'మా ఇంటి బంగారం'..**

సమంత నటించిన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' హిట్ టాక్‌తో బాక్సాఫీసు వద్ద దూసుకుపోతోంది. మూడు రోజుల్లో రూ.43 కోట్లు వసూలు చేసింది. నార్త్ అమెరికాలో వన్ మిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరింది. సోషల్ మీడియాలోనూ ఈ సినిమాకు సంబంధించిన రీల్స్ వైరల్‌గా మారాయి.

# #Mega158.. ఫుల్ స్వింగ్‌లో చిరు -బాబీ మూవీ




అగ్ర కథానాయకుడు చిరంజీవి ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఆయన సినిమా మొదలు పెట్టడమే ఆలస్యం పరుగులు పెట్టిస్తున్నారు. చిరు కీలక పాత్రలో బాబీ దర్శకత్వంలో ఓ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. #Mega158 (వర్కింగ్ టైటిల్)గా రానున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇటీవలే పొల్లాచ్చిలో కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. సోమవారం నుంచి హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ మొదలైంది. చిరుతో పాటు ప్రధాన తారాగణంపై కీలక టాకీ పార్ట్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ క్రమంలో పొల్లాచ్చి షెడ్యూల్‌లో షూటింగ్‌కు సంబంధించిన విశేషాలతో కూడిన వీడియోను చిత్ర బృందం పంచుకుంది. అక్కడ కొంత టాకీతో పాటు, యాక్షన్ సీక్వెన్స్ కూడా తీసినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. 'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత చిరు బాబీ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. దీనికి తగ్గట్లే ఈసారి ఓ చక్కటి భారీ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో చిరు రెండు కోణాల్లో సాగే పాత్రలో అలరించే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం తమన్, ఛాయాగ్రహణం విజయ్ కార్తీక్ కన్నన్ అందిస్తున్నారు.




# చిత్రం.. భళారే విచిత్రం..

## జూన్ చివరి వారం.. నో రిలీజ్.. ఓన్లీ రీ-రిలీజ్

వేసవి అంటే వరుస సినిమాలతో బాక్సాఫీస్ కళకళలాడేది. ఈ ఏడాది ఆ సందడే కరవైంది. ఒకట్రెండు సినిమాలు తప్ప పెద్దగా మెరుపులు లేవు. ఈలోగా స్కూళ్లు, కాలేజ్‌లు మొదలైపోయాయి. గతవారం వరుస చిత్రాలు బాక్సాఫీస్‌ను పలకరించగా, ఇప్పటివరకూ ఉన్న సమాచారం మేరకు జూన్ చివరి వారంలో కొత్త తెలుగు సినిమాలేవీ లేకపోవడం గమనార్హం. పైగా పలు చిత్రాలు రీరిలీజ్ అంటూ ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హనుమాన్'. 2024లో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు సరికొత్త హంగులతో ప్రేక్షకుల ముందుకు మళ్లీ రాబోతోంది. 'హనుమాన్' 3డీ వెర్షన్ జూన్ 25న థియేటర్స్‌లో సందడి చేయనుంది. మహేశ్‌బాబు స్టార్‌డమ్‌ను పెంచిన చిత్రం 'ఒక్కడు'. గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ జూన్ 26న మళ్లీ విడుదల అవుతోంది. మంచు విష్ణు కీలక పాత్రలో రూపొందిన భక్తిరస చిత్రం 'కన్నప్ప'. ఈ మూవీని జూన్ 27న మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఎంపిక చేసిన థియేటర్స్‌లో దీనిని ప్రదర్శించనున్నారు. రాజ్‌తరుణ్, అవికా గోర్, రావు రమేశ్ కీలక పాత్రల్లో నటించిన ఎంటర్‌టైనర్ 'సినిమా చూపిస్త మావ'. త్రినాథరావు దర్శకత్వంలో వచ్చిన ఈ మూవీ కూడా జూన్ 27న మళ్లీ థియేటర్లకు రానుంది. వీటితో పాటు పవన్‌కల్యాణ్ 'గబ్బర్ సింగ్'ను కూడా రీరిలీజ్ చేయాలని నిర్మాత బండ్ల గణేశ్ నిర్ణయించుకున్నారు. కానీ, 'పెద్ది' కోసం ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు.




# 'కాక్‌టైల్ 2'.. తొలి వీకెండ్‌లోనే భారీ వసూళ్లు

హోమీ అదజానియా దర్శకత్వంలో బాలీవుడ్ హీరో షాహిద్ కపూర్, తారలు రష్మిక, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కాక్‌టైల్ 2'. ఈ సినిమా జూన్ 19న విడుదలై బాక్సాఫీస్ వద్ద జోరు కొనసాగిస్తోంది. తొలి వీకెండ్‌లోనే రూ.50 కోట్ల మార్క్‌ను దాటేసింది. ఈ వారాంతంలో పెద్ద హిందీ సినిమాలేవీ విడుదల కాకపోవడంతో 'కాక్‌టైల్ 2'కు పోటీ లేదు. దీంతో మెట్రో నగరాలు, అర్బన్ సెంటర్లలో యువత పెద్ద సంఖ్యలో థియేటర్లకు వచ్చారు. సినీ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ''2026లో విడుదలై తొలి వీకెండ్‌లో రూ.50 కోట్లు దాటిన హిందీ సినిమాలు వేళ్లపై లెక్కపెట్టినన్ని మాత్రమే ఉన్నాయి. వాటిలో 'కాక్‌టైల్ 2' ఒకటిగా నిలిచింది. #Cocktail2 తొలి వీకెండ్‌లోనే హాఫ్ సెంచరీ కొట్టింది. శని, ఆదివారాల్లో భారీ వసూళ్లు రాబట్టింది. యువత ఈ సినిమాను మనస్ఫూర్తిగా ఆదరించారు. శుక్రవారం రూ.14.10 కోట్లు, శనివారం రూ.17.15 కోట్లు, ఆదివారం రూ.18.85 కోట్లు వసూలు చేసింది'' అని ఆయన 'ఎక్స్' వేదికగా తెలిపారు.

# పవన్ కల్యాణ్‌ను కలిసిన దర్శకుడు మెహర్ రమేశ్..

దర్శకుడు మెహర్ రమేశ్.. ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిశారు. త్వరలో జరగనున్న తన కుమార్తె వివాహానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ ఫొటోలను ఎక్స్ వేదికగా పంచుకున్న దర్శకుడు.. ఎన్నేళ్లయినా పవన్‌తో తన బంధం శాశ్వతమని పేర్కొన్నారు. ''కొన్నేళ్ల క్రితం విజయవాడలో జరిగిన నా పెళ్లికి పవన్ వచ్చి నన్ను ఆశీర్వదించారు. ఈరోజు నేను విజయవాడ వచ్చి నా కుమార్తె పెళ్లికి పవన్‌ను ఆహ్వానించాను. ఇది నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. కాలం మారుతుంది.. తరాలు మారతాయి.. కానీ మా సోదర బంధం శాశ్వతం'' అంటూ పంచుకున్న ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఏపీ రాష్ట్ర ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా ఇటీవల ఏపీ ప్రభుత్వం మెహర్ రమేశ్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన మెహర్ రమేశ్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.